# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్    బుధవారం 28-2-2024    NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026    సంపుటి :30    సంచిక:165    పేజీలు:6    వెల: రూ.1/-


## త్వరలో 'మెగా డీఎస్సీ' నోటిఫికేషన్.. విద్యాశాఖ కసరత్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 27:తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి 'మెగా డీఎస్సీ' నోటిఫికేషన్ విడుదల చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. మెగా డీఎస్సీ ద్వారా దాదాపు 11,060 పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్సీకి సంబంధించిన నివేదికను విద్యాశాఖ సిద్ధం చేసి సీఎం కార్యాలయానికి పంపింది. అక్కడి నుంచి అనుమతి రాగానే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలిసింది. ఇప్పటికే డీఎస్సీ నిర్వహణపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. టీచర్ల పదోన్నతులు, బదిలీల్లో ఇబ్బందులపై దృష్టిసారించాలని సీఎం సూచించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ .. నలుగురు మావోయిస్టుల హతం

ఛత్తీస్‌గఢ్ ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఛత్తీస్‌గఢ్ లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లా చోటే తుంగాలి అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. అటవీ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ సీఆర్‌పీఎఫ్ జవాన్లు మంగళవారం సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు మావోయిస్టులు కాల్పులు జరిపారు. పోలీసులు సైతం ఎదురుకాల్పులకు దిగి నలుగురు మావోయిస్టులను మట్టుపెట్టారు. ఘటనాస్థలం నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు కొనసాగుతోంది.

# ఉచిత విద్యుత్ , రూ.500 గ్యాస్ పథకాలను ప్రారంభించిన రేవంత్ ..




హైదరాబాద్, ఫిబ్రవరి 27: ఉచిత 200 యూనిట్ల విద్యుత్, ఐదు వందల గ్యాస్ సిలిండర్ పథకాలను నేడు సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీలు అమలు చేస్తున్నామన్నారు. ప్రజలకు కాంగ్రెస్ మాట ఇస్తే వెనకడుగు వేయదని, ఎన్నికల కోడ్ కారణంగా చేవెళ్ల సభలో ప్రారంభించాల్సిన పథకాలను, సచివాలయంలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. అలాగే ప్రజా పాలనలో ఆరు పథకాలకు అప్లై చేసుకోని వారికి మరోసారి అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ప్రకటించిందని, విప్లవాత్మక ఆలోచనలతో కూడిన నిర్ణయాలు కాంగ్రెస్ తీసుకుందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తోందా అని రాష్ట్రం వైపు దేశం చూస్తుందన్నారు.. ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది బీఆర్ఎస్ అని ఆయన విమర్శలు గుప్పించారు. బ్యాంకుల నుంచి అప్పు తెచ్చి జీతాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు భట్టి. గ్యారెంటీలు అమలు చేయడం కోసం కసరత్తు చేస్తున్నామని, దుబారా తగ్గించుకున్నామన్నారు.

అక్కడ ఇక్కడ నిధులు జమ చేస్తుకుంటూన్నామని, సామాన్యులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్త పడుతున్నామన్నారు భట్టి విక్రమార్క. ఇది చారిత్రాత్మకమైన రోజు అని, ఆరు గ్యారెంటీల అమలు దేశానికి దశ దిశ నిర్దేశం చేస్తాయన్నారు. అసాధ్యాన్ని సాధ్యం చేయడమే నేటి ఇందిరమ్మ రాజ్యమని, ఎన్ని ఇబ్బందులు ఉన్న తూచా తప్పకుండా గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ వాడుతున్నరో అందరికీ మార్చి నెలలో జీరో బిల్ ఇస్తామని, అర్హత కలిగిన వారికి ఎలాంటి ఆంక్షలు విధించడం లేదన్నారు భట్టి విక్రమార్క. గ్రామ సభల ద్వారా అర్హులను గుర్తించామన్నారు. కాంగ్రెస్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారన్నారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఎవరూ మర్చిపోలేని రోజు అని ఆయన వ్యాఖ్యానించారు. తెల్లకార్డు ఉన్న వారికి 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. గత మూడేళ్ళుగా యావరేజ్ గా ఎన్ని సిలిండర్లు వాడారో అన్ని సిలిండర్లు ఇస్తామని ఆయన వెల్లడించారు. సుమారు 40 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారని, భవిష్యత్ లో తెల్ల కార్డు ఉండి ఎల్పీజీ కనెక్షన్ ఉన్న మిగతా వారికి కూడా ఇస్తామని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారుల జాబితాలోకి ఇప్పుడు లేని వారిని తర్వాత చేర్చుతామని ఆయన తెలిపారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చామని, ఇప్పటికే రెండు గ్యారెంటీలు అమలు చేశామన్నారు. మరో రెండు గ్యారెంటీలు ఇప్పుడు అమలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో నూటికి నూరు శాతం మిగతా హామీలు అమలు చేస్తామన్నారు కొండా సురేఖ. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారన్న సీఎం, ఆమె స్ఫూర్తితో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని తెలిపారు. ఆరు గ్యారంటీలను కూడా కచ్చితంగా అమలు చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే 2 హామీలు అమలు చేశామని గుర్తు చేశారు. ఈ పథకంలో లోపాలు గుర్తించి మార్పులు చేసుకుంటూ ముందుకెళ్తామని వెల్లడించారు. పేదలకు ఎక్కువ ఉపయోగం కలిగేలా అభయ హస్తం గ్యారంటీలు ప్రకటించినట్లు పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు,, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, స్పీకర్ ప్రసాద్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.




# పేదలకు ఎక్కువ ఉపయోగం కలిగేలా ఆరు గ్యారంటీలు : భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 27:రాష్ట్రంలోని పేదలకు ఎక్కువ ఉపయోగం కలిగేలా ఆరు గ్యారంటీలను రూపొందించామని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండు గ్యారంటీలను ఇవాళ అమలు చేసింది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ స్కీములను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ. రూ.500 లకే గ్యాస్ సిలిండర్ స్కీము మహిళలకు చాలా ఊరట ఇస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని 40 లక్షల కుటుంబాలకు గ్యాస్ సిలిండర్ పథకంలో లబ్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. లోపాలు గుర్తించి ఈ పథకంలో మార్పులు చేసుకుంటూ వెళ్తామని చెప్పారు. త్వరలో నేరుగా లబ్ధిదారు లు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ పొందేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైందనీ అసహనం వ్యక్తం చేశారు. ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ తాము ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తున్నావ న్నారు. ఇచ్చిన అన్ని గ్యారంటీలను అమలు చేసి తీంతామని.. అంద ుకోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. మన దేశంలో కొన్నేళ్లుగా గ్యాస్ సిలిండర్ ధరలు భారీగా పెరుగుతు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పెరిగిన ధరల నుంచి సామాన్యుల కు, మహిళలకు ఊరట ఇచ్చేందుకు గృహాజ్యోతి పథకాన్ని ప్రకటించినట్లు తెలిపారు.

# 500 గ్యాస్ సిలిండర్ స్కీమ్‌కు గైడ్‌లైన్స్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 27: మహాలక్ష్మి పథకంలో భాగంగా మరో స్కీమ్ అమలుకు శ్రీకారం చుట్టింది తెలంగాణ సర్కార్ రూ. 500 గ్యాస్ సిలిండర్ స్కీమ్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

ఈ క్రమంలో రూ. 500 గ్యాస్ పథకానికి సంబంధించి గైడ్‌లైన్స్ విడుదల చేశారు. ఈ నిబంధనల ప్రకారం.. పథకం అమలు ఎలా చేస్తారు.. ఎవరు ఈ పథకానికి అర్హులు.. వంటి కీలక వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

– మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చే స్కీమ్‌కి సంబంధించిన జీవో జారీ చేసింది తెలంగాణ ప్రభుత్వం.

–సబ్సిడీ గ్యాస్ సిలిండర్ కోసం మూడు క్రైటీరియాలను ప్రకటించింది ప్రభుత్వం.

–సబ్సిడీ సిలిండర్ కోసం ప్రజాపాలనలో అప్లై చేసిన వారి లిస్ట్ ఆధారంగా 39.5 లక్షల లబ్ధిదారులను గుర్తించారు.

–ఈ పథకానికి అర్హులుగా తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా పెట్టింది రాష్ట్ర ప్రభుత్వం.

–మూడు సంవత్సరాల వినియోగాన్ని పరిగణలోకి తీసుకొని.. దాని యావరేజ్ ఆధారంగా సంవత్సరానికి సిలిండర్స్ కేటాయిస్తారు.

–వినియోగదారులు తొలుత మొత్తం డబ్బు చెల్లించి సిలిండర్ తీసుకోవాలి.

–ఆ తరువాత వినియోగదారుల ఖాతాలోకి తిరిగి సబ్సిడీ అమౌంట్ జమ చేస్తారు.

–గ్యాస్ సబ్సిడీని ప్రభుత్వం నేరుగా ఆయిల్ సంస్థలకు ఇవ్వనుంది. సంస్థల నుంచి ఆ ద్వారా వినియోగదారులకు నగదు చెల్లింపు చేస్తారు.

–జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని మానిటరింగ్ చేయనుంది ప్రభుత్వం.

–భవిష్యత్తులో వినియోగదారుల నుంచి కేవలం రూ. 500 చెల్లించేలా ఏర్పాటు చేయనుంది ప్రభుత్వం.

–48 గంటల్లోనే వినియోగదారుల అకౌంట్‌లోకి సబ్సిడీ అమౌంట్ ట్రాన్స్ఫర్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు.

# రాష్ట్రంలో మూడు చోట్ల ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తాం.. రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 27:రాష్ట్రంలో మూడు చోట్ల ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. త్వరలో జీనోమ్ వ్యాలీ ఫేజ్–2ని కూడా ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. హైదరాబాద్ వేదికగా జరుగుతున్న బయో ఏషియా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో హైదరాబాద్‌ను లైఫ్ సైన్సెస్‌కు రాజధానిగా చేస్తామని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా 1/3 వంతు ఫార్మా ఉత్పత్తులను ప్రపంచానికి సరఫరా చేయడం సంతోషదాయమని అన్నారు. హైదరాబాద్ ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో అగ్రగామిగా ఉందని వివరించారు రేవంత్ . ఇప్పటికే దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన అంతర్జాతీయ పారిశ్రామిక సదస్సులో పాల్గొని రాష్ట్రానికి రూ. 40 వేల కోట్ల మేర పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కొవిడ్ అనంతరం ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించామన్నారు. లైఫ్ సైన్సెస్ రాజధాని మన నగరం అని అనడంలో ఎలాంటి సందేహం లేదంటూ ప్రపంచంలో మూడు కొవిడ్ వ్యాక్సిన్‌లు వచ్చాయని, వాటిలో ఒక వ్యాక్సిన్‌ను అందించిన ఘనత హైదరాబాద్‌కు దక్కిందని గుర్తు చేశారు.

ఎన్నో పరిశోధనలకు నిలయంగా మన భాగ్యనగరం ఉందని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ, స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం అందించడంతో పాటు ఎంఎస్ఎంఈలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడించారు. ఫార్మా రంగంలో సవాళ్లను తాను అర్థం చేసుకోగలనని అన్నారు. ఇటీవల కొంత మంది ఫార్మా రంగ ప్రతినిధులతో సమావేశమయ్యాయని, ప్రభుత్వ పరంగా ఈ రంగానికి బాసటగా నిలుస్తామని అని భరోసా ఇచ్చారు.

ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వంపై పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనమే ఈ ప్రతిష్ఠాత్మక 21వ బయో ఆసియా సదస్సుకు హైదరాబాద్ వేదిక కావడమేనని అన్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు 40వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పారిశ్రామికవేతలకు ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కొత్త జీవ వైద్య విధానాన్ని అందుబాటులోకి తీసుకొత్సామని తెలిపారు. కేవలం పరిశ్రమల స్థాపనే కాకుండా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని ఉద్యోగాల కల్పన చేసే విధంగా పాలసీ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్రాన్ని నైపుణ్య శిక్షణ కేంద్రంగా మార్చేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించేలా తగిన శిక్షణ ఇచ్చేలా విధానం రూపొందిస్తున్నా మన్నారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సులో 100 మందికి పైగా ప్రముఖ శాస్త్రవేత్తలు, ప్రపంచ దేశాల విదేశీ ప్రతినిధులు ఇందులో పాల్గొంటున్నారు.

## నేటి నుంచి దంచికొట్టనున్న ఎండలు..!

హైదరాబాద్, ఫిబ్రవరి 27: తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. బుధవారం నుంచి క్రమక్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో రేపట్నుంచి ఎండలు మరింత దంచికొట్టే అవకాశం ఉంది. సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. మార్చి రెండో వారం నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. మార్చి రెండో వారంలో ఒక వైపు అధిక ఉష్ణోగ్రతలు, మరో వైపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులకు బీటెక్ విద్యార్థి బలి

హైదరాబాద్, ఫిబ్రవరి 27: ఆన్‌లైన్ లోన్ యాప్ నిర్వాహకుల ఆగడాలు రోజురోజుకు శృతి మించుతున్నాయి. లోన్‌యాప్ పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికి.. వారి దురాగాతాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి బలయ్యాడు. మనోజ్ అనే విద్యార్థి ఈఎంఐ కట్టకపోవడంతో లోన్‌యాప్ ఏజెంట్లు మనోజ్ బంధువులకు ఫోన్ చేశారు. దీంతో పరువు పోయిందని భావించిన మనోజ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలంగాణకు ఎత్తిపోతలే శరణ్యం.. కాస్ట్ బెనిఫిట్ చూడడం సరికాదు : కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 27:కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎండగట్టారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. ఆయన మాట్లాడుతూ 'నిన్న ముఖ్యమంత్రి మాట్లాడుతుంటే ఆశ్చర్యం అనిపించింది. వర్షాలు బాగాపడ్డాయని ఒకాయన.. బోర్‌వెల్స్ పెరిగాయని ఒకాయన. రైతులు బోర్‌వెల్స్ ఎప్పుడు వేస్తరు.. భూగర్భజలాలు పెరిగితేనే కదా.. భూగర్భజలాలు పెరుగకపోతే కొత్త బోర్లు వేస్తరా.. భూగర్భ జలాలు పెరిగినయ్.. చెరువులు నిండినయ్. వాగులు నిండినయ్ కాబట్టే ఇవాళ ఈ జలవిజయాలు కాళేశ్వరం పుణ్యం అనే మాట నేను రైతులకు చెబుతున్నా. కాళేశ్వరం కింద ఉండే బరాజ్‌లు, రిజర్వాయర్‌లు నిండిన ఫలితం.. భూగర్భ జలాలు పుష్కలంగా పెరిగిన ఫలితం' అని తెలిపారు. 'కాళేశ్వరంలో భాగంగా మిడ్ మానేరు జంక్షన్‌గా మారిన మా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆరు మీటర్లు భూగర్భ జలాలు పెరిగాయి. ఈ విషయాన్ని లాల్ బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ తెలిపింది. యువ ఐఏఎస్‌లకు పాఠాలు చెబుతారో.. వాటర్ కాన్జర్వేషన్ మీద కాళేశ్వరం ప్రాజెక్టు క్లాసిక్ ఎగ్జాంపుల్ అని పాఠాలుచెప్పే స్థాయికి కాళేశ్వరం ద్వారా సాధించిన విజయం, రిజిస్టర్ అయిన విషయాన్ని గుర్తు చేస్తున్నాం. కాళేశ్వరంతో పాతాళగంగ పైకి వచ్చింది. హైదరాబాద్‌కు మంచినీళ్ల కరువు అనే లేకుండా భరోసా ఇచ్చిన అమృత వాహిని కాళేశ్వరం. దీనిపై ఇవాళ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నరు. అసెంబ్లీలో రిపోర్టు పెట్టారు. తెలంగాణలో ప్రత్యామ్నాయం లేదు. కాస్ట్ బెనిఫిట్.. బెనిఫిట్ టూ కాస్ట్, వయోబులిటి అని మాట్లాడితే అర్థం ఉంటుంది.

తెలంగాణలో ప్రత్యా మ్నా యం లేదు. నీళ్లు కావాలంటే ఎతిపోయాల్సిందే తప్ప వేరే మార్గం లేదు. పబ్లిక్ యుటిలిటీ.. లక్షల, కోట్ల మంది ప్రజలకు సంబంధించిన జీవి తాలతో ముడిపడి ఉన్న ప్రాజెక్టులకు.. ఇవాళ కొందరు మాట్లాడే మాటలు.. వయోబులిటి ఉందా? లేదా? పాయింట్ ఏంటంటే.. కాళ్లు అడ్డం పెడితే నీళ్లు వచ్చే పరిస్థితి తెలంగాణలో లేదు' అన్నారు. 'ప్రాజెక్టులు కట్టి ఎత్తిపోసుకుంటే మన బీళ్లకు నీళ్లు రావు.. ఇది వాస్తవం. మన భౌగోళిక పరిస్థితి అలా ఉంది. అందుకే ఎంత ఖర్చయినా సరే.. ఎత్తిపోతలే శరణ్యం తప్ప.. తెలంగాణకు వేరే మార్గం లేదు. ఉదాహరణకు గల్ఫ్ దేశాలను తీసుకుంటే.. సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, యూఏఈలో తాగునీరు లేదు. తాగునీరు లేదని ఊరుకోం కదా? సముద్రం నీళ్లు ఉన్నయ్. వాటిలో ఉప్పును డిసాలినేషన్ చేసి.. ఎంత ఖర్చయినా మంచినీళ్లు తాగాల్సిందే తప్పా.. వేరే మార్గం లేదు కదా.. వయోబులిటీ లేదు..

కాస్ట్ బెనిఫిట్ రేషియో చూస్తే డిసాలినేషన్ ప్లాంట్ పనికిరాదు అంటే నీళ్లు లేక సచ్చి పోతరు. తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి. బీళ్లుగా మారిన తెలంగాణ పొలాలు.. దశాబ్దాల పాటు జరిగిన ఉద్యమాలు.. తెలంగాణలో రైతులకు జరిగిన అన్యాయం. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని.. ఎంత ఖర్చయినా సరే ఎత్తిపోతలే శరణ్యమని ఒక కామన్ సెన్స్ ఉండెకాబట్టే.. ఇంజినీర్లు చెప్పారు కాబట్టే మనం ఎత్తిపోతల పథకాలు చేసుకున్నాం.


నేటి కందం– నేటికి అందం

నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం


**శీతమయూఖుల మాదిరి**
**జాతికి విజ్ఞానమునిడు జనుల దలచుచున్**
**జాతీయ సైన్సు దినమును**
**జాతి జనులు జరుపవలయు సంతస మొప్పున్**

(ఫిబ్రవరి 28 జాతీయ సైన్సు దినోత్సవం)



–రాధశ్రీ

సెల్:9494481210

# కేరళలో తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వి ఎస్ ఎస్ సి) ను సందర్శించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కేరళలోని తిరువనంతపురంలో విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్ (వి.ఎస్.ఎస్.సి)ని సందర్శించారు సుమారు రూ.1800 కోట్ల విలువైన మూడు ముఖ్యమైన అంతరిక్ష మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ లో ఎస్ఎల్ వి ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ (పిఐఎఫ్); . మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ లో కొత్త 'సెమి క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజిన్ అండ్ స్టేజ్ టెస్ట్ ఫెసిలిటీ'; తిరువనంతపురంలోని వి.ఎస్.ఎస్.సి వద్ద 'ట్రైసోనిక్ విండ్ టన్నెల్' ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. ఈ సందర్భంగా గగన్ యాన్ మిషన్ పురోగతిని సమీక్షించిన మోదీ, మిషన్ ద్వారా అంతరిక్షం లోకి వెళ్లేందుకు నియమితులైన నలుగురు వ్యోమగాములకు 'వ్యోమగామి వింగ్స్' ప్రదానం చేశారు. గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా వీరిలో ఉన్నారు.

భారత్ మాతాకీ జై నినాదం తో సభా ప్రాంగణం మారుమోగుతుండగా, 'వ్యోమగాములకు నిలబడి అభినందనలు తెలపాలని' పిలుపు ఇస్తూ ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించారు.

ప్రతి దేశ అభివృద్ధి ప్రయాణంలో వర్తమానాన్ని మాత్రమే కాకుండా భవిష్యత్ తరాలను నిర్వచించే ప్రత్యేక క్షణాలు ఉన్నాయని, ఇది భూమి, గాలి, నీరు , అంతరిక్షంలో దేశం సాధించిన చారిత్రాత్మక విజయాలను ప్రస్తుత తరం గర్వించగల సందర్భం అని అన్నారు. అయోధ్య నుంచి తయారైన కొత్త 'కాలచక్రం' ప్రారంభం గురించి తాను చేసిన ప్రకటనను గుర్తు చేసిన ప్రధాని మోదీ, భారతదేశం ప్రపంచ క్రమంలో తన స్థలాన్ని నిరంతరం విస్తరిస్తోందని, దేశ అంతరిక్ష కార్యక్రమంలో దాని దృశ్యాలను చూడవచ్చని అన్నారు.

చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ అవతరించిన సందర్భంగా చంద్రయాన్ విజయాన్ని ప్రధాన మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. "ఈ రోజు శివ–శక్తి కేంద్రం యావత్ ప్రపంచానికి భారతీయ పరాక్రమాన్ని పరిచయం చేస్తోంది", అని ఆయన అన్నారు. వ్యోమగాములుగా నియమితులైన నలుగురు గగన్ యాన్ ప్రయాణికుల పరిచయాన్ని చారిత్రాత్మక సందర్భంగా ఆయన అభివర్ణించారు. "వారు నలుగురు కేవలం పేర్లు లేదా వ్యక్తులు కాదు, వారు 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను అంతరిక్షంలోకి తీసుకువెళ్ళే నాలుగు శక్తులు" అని ప్రధాన మంత్రి అన్నారు. '40 ఏళ్ల తర్వాత ఓ భారతీయుడు అంతరిక్షంలోకి వెళ్తున్నాడు. అయితే, ఇప్పుడు సమయం, కౌంట్ డౌన్ తో పాటు రాకెట్ కూడా మనదే' అన్నారు. వ్యోమగాములను కలుసుకుని జాతికి పరిచయం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ప్రధాని యావత్ దేశం తరఫున వారికి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యోమగాముల పేర్లను ప్రస్తావిస్తూ, వారి పేర్లు భారతదేశ విజయంతో కలిసిపోయాయని, అవి నేటి భారతదేశ విశ్వాసం, ధైర్యం, శౌర్యం క్రమశిక్షణకు ప్రతీక అని ప్రధాన మంత్రి అన్నారు. శిక్షణ పట్ల వారి అంకితభావం, స్ఫూర్తిని ఆయన ప్రశంసించారు. "వారు భారతదేశ అమృత తరానికి ప్రతినిధులు, వారు ఎన్నడూ వెనుదిరగరు, అన్ని ప్రతికూలతలను సవాలు చేసే శక్తిని చూపుతారు" అన్నారు. ఈ మిషన్ కోసం ఆరోగ్యకరమైన శరీరం , ఆరోగ్యకరమైన మనస్సు ఆవశ్యకతను తెలియ చేస్తూ, ట్రైనింగ్ మాడ్యూల్ లో భాగంగా యోగా పాత్రను ప్రధాన మంత్రి ప్రస్తావించారు. 'దేశ ప్రజల ఆకాంక్షలు, ఆశీస్సులు మీపై ఉన్నాయని' ప్రధాని మోదీ పేర్కొన్నారు. గగన్ యాన్ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న ఇస్రోకు చెందిన స్టాఫ్ ట్రైనర్లందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

నలుగురు వ్యోమగాముల శిక్షణకు అంతరాయం కలిగించే విధంగా ప్రముఖుల దృష్టి గురించి ప్రధాని కొన్ని ఆందోళనలను వ్యక్తం చేస్తూ, వ్యోమగాములు ఎలాంటి అంతరాయాలు లేకుండా శిక్షణ కొనసాగించేందుకు వారి కుటుంబాలు, ఇతరులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అధికారులు గగన్ యాన్ గురించి ప్రధానికి వివరించారు. గగన్ యాన్ లో చాలా పరికరాలు మేడ్ ఇన్ ఇండియావి కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని టాప్ 3 ఆర్థిక వ్యవస్థల్లోకి భారత్ ప్రవేశించడంతో గగన్ యాన్ సన్నద్ధత సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు అంకితమైన ప్రాజెక్టులు కొత్త ఉద్యోగాలకు దారితీస్తాయని, భారతదేశ ప్రతిష్ఠను పెంచుతాయని ఆయన అన్నారు.

భారత అంతరిక్ష కార్యక్రమంలో నారీ శక్తి పాత్రను ప్రశంసిస్తూ, "అది చంద్రయాన్ అయినా గగన్ యాన్ అయినా, మహిళా శాస్త్ర వేత్తలు లేకుండా ఇలాంటి ప్రాజెక్టును ఊహించలేం" అని ప్రధాన మంత్రి అన్నారు. ఇస్రోలో 500 మందికి పైగా మహిళలు నాయకత్వ స్థానాల్లో ఉన్నారని తెలిపారు.

యువ తరంలో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించే బీజాలు వేయడంలో భారత అంతరిక్ష రంగం పాత్ర కీలకమని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. ఇస్రో సాధించిన విజయం నేటి పిల్లలలో శాస్త్రవేత్తగా ఎదగాలనే ఆలోచనను నాటిందని అన్నారు. "రాకెట్ కౌంట్ డౌన్ భారతదేశంలోని లక్షలాది మంది పిల్లలకు స్ఫూర్తినిస్తుంది, ఈ రోజు కాగితపు విమానాలను తయారు చేసేవారు మీలాంటి శాస్త్రవేత్తలు కావాలని కలలు కంటున్నారు" అని శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రధాన మంత్రి అన్నారు. యువత సంకల్పబలం దేశ సంపదను సృష్టిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. చంద్రయాన్ 2 ల్యాండింగ్ సమయం దేశంలోని ప్రతి చిన్నారికి ఒక అభ్యాస అనుభవం అని, గత ఏడాది ఆగస్టు 23 న చంద్రయాన్ 3 ని విజయవంతంగా ల్యాండింగ్ చేయడం యువతలో కొత్త శక్తిని నింపిందని ఆయన అన్నారు. "ఈ రోజును ఇప్పుడు అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నాం" అని ఆయన తెలియజేశారు, అంతరిక్ష రంగంలో దేశం సాధించిన వివిధ రికార్డులను వివరించారు. తొలి ప్రయత్నంలో అంగారక గ్రహాన్ని చేరుకోవడం, ఒకే మిషన్ లో 100కు పైగా ఉపగ్రహాలను ప్రయోగించడం, భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని కక్ష్యలో ఆదిత్య ఎల్ 1 సోలార్ ప్రోబ్ ను విజయవంతంగా ప్రవేశపెట్టడం వంటి విజయాలను ఆయన ప్రస్తావించారు. 2024 మొదటి కొన్ని వారాల్లో ఎక్స్ పో-శాట్, ఇన్ శాట్-3డీఎస్ సాధించిన విజయాలను కూడా ఆయన ప్రస్తావించారు.

'మీరంతా భవిష్యత్ అవకాశాలకు కొత్త ద్వారాలు తెరుస్తున్నారు' అని ఇస్రో బృందం తో ప్రధాని మోదీ అన్నారు. రానున్న పదేళ్లలో భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ఐదు రెట్లు వృద్ధి చెంది 44 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ప్రధాని అన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ గ్లోబల్ కమర్షియల్ హబ్ గా మారుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో భారత్ మరోసారి చంద్రుడిపైకి వెళ్లనుంది.

# నోబెల్ విజేత రామన్ ప్రభావం నేటి యువతకు దారి దీపం !

## (28 న 'జాతీయ వైజ్ఞానికశాస్త్ర దినోత్సవం' సందర్భంగా)

మానవాళి పరిణామక్రమంలో భాగంగా నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ నానో యుగం వరకు మనిషి చూడని వింతలు లేవు, అనుభవించిన విడ్డూరాలు లేవు. ఒకనాటి ల్యాండ్ లైన్ ఫోన్ అంతరించి, నేడు స్మార్ట్ సెల్ ఫోన్ శరీరంలో శాశ్వత అంగమైంది. డిజిటల్ కమ్యునికేషన్ విప్లవంతో విశ్వమే అరచేతిలో తిష్ట వేసింది. అతి సామాన్య మానవాళి దినచర్య నుంచి కూడా వైజ్ఞానిక సాంకేతికశాస్త్రాలను వేరు చేయడం అసాధ్యం అయ్యింది. ఒక వ్యక్తి తన జీవితకాలంలో ఊహించడానికి కూడా వీలు కాని జీవనశైలి మార్పులను అబ్బురపడుతూ అనుభవపూర్వకంగా ఆస్వాదిస్తున్నాడు.

మానవాళికి వరంగా మారిన శాస్త్ర సాంకేతిక రంగాలు:

విశ్వ అత్యుత్తమ ఆవిష్కరణల్లో ప్రధానమైనది సైన్స్ మాత్రమే అని భావించి, దాని ప్రమేయం లేకుండా ప్రపంచ అభివృద్ధికి అడుగులు పడవని నమ్ముతున్నాం. ఈ అద్భుత సకారాత్మక మార్పులకు కారణం వైజ్ఞానికశాస్త్ర, సాంకేతికశాస్త్ర పరిశోధనా ఫలాలే అని విశ్వసిస్తున్నాం. వైజ్ఞానికశాస్త్ర ఆవిష్కరణలకు అంతం లేదు. నిన్నట ఆవిష్కరణ నేడు పాతబడిపోతున్నది. నిత్యం ప్రయోగశాలల్లో నూతన ఆవిష్కరణలు జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిశోధనా ఫలితాలు సైన్స్ సిద్ధాంతాలు, సూత్రాలు, పరికల్పనలు, ఆవిష్కరణలు టెక్నాలజీకి ఊపిరి పోస్తున్నాయి. వైజ్ఞానికశాస్త్రం లోంచి సాంకేతికశాస్త్రం పుట్టింది. ఇలా శతాబ్దాలుగా జరుగుతున్న శాస్త్రసాంకేతిక అభివృద్ధి ఫలాలను నేటి ఇంటర్నేట్ స్మార్ట్ యుగం మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తున్నది. అత్యాధునిక శాస్త్రసాంకేతికాభివృద్ధితో కృత్రిమ మేధ కొత్తపుంతలు తొక్కడం, ప్రపంచమే కుగ్రామంగా మారడం ఆశ్చర్యకరంగా చూస్తూ విస్తుపోతున్నాం.

స్వదేశీ టెక్నాలజీతో భారత సుస్థిరాభివృద్ధి:

సైన్స్ అభివృద్ధిలో పాలుపంచుకున్న మహామహులు ఎందరో ఉన్నారు, వారందరికీ వందనాలు. ఈ సర్వోత్తమ శాస్త్రవేత్తల శ్రేణిలో ముందున్న వారిలో ఒకరు మన సర్ సి.వి. రామన్ (చంద్రశేఖర వెంకట రామన్) అని మనకు విధితమే. 28 ఫిబ్రవరి 1928న విశ్వవిఖ్యాత భౌతికశాస్త్ర శాస్త్రవేత్త, సర్ సి.వి. రామన్ పరిశోధనల ఫలితంగా 'రామన్ ఎఫెక్ట్ (రామన్ ప్రభావం)'ను కనుగొన్న రోజుగా 28 ఫిబ్రవరి 1987కి భారతీయ సైన్స్ చరిత్రలో చోటు దక్కించుకున్నది. ఈ అద్భుత ఆవిష్కరణకు గుర్తుగా దేశవ్యాప్తంగా 28 ఫిబ్రవరిన 'జాతీయ వైజ్ఞానికశాస్త్ర దినోత్సవం (నేషనల్ సైన్స్ డే)' ఘనంగా నిర్వహించుట జరుగుతోంది. రామన్ ఎఫెక్ట్ విశిష్టతను గుర్తించిన అంతర్జాతీయ వైజ్ఞానికశాస్త్ర సమాజం 1930లో భౌతికశాస్త్ర విభాగంలో సర్ సి. వి. రామన్‌కు నోబెల్ బహుమతిని ప్రకటించడం జరిగింది. 'జాతీయ వైజ్ఞానిక దినం–2024' నినాదంగా 'స్వదేశీ సాంకేతికతతో భారత వికాసం (ఇండిజీనియస్ టెక్నాలజీస్ ఫర్ వికసిత్ భారత్)' అనబడ నినాద సారాంశం తీసుకోబడింది.

శాస్త్రసాంకేతిక రంగాల పట్ల యువతకు అవగాహన:

జాతీయ వైజ్ఞానికశాస్త్ర దినోత్సవంలో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీల పట్ల సదవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యాలయాలు, పరిశోధనాశాలలు, పౌరసమాజ వేదికల్లో సైన్స్ ఆధారిత ఉపన్యాసాలు, చర్చలు, సైన్స్ ప్రదర్శనలు, వ్యాస రచనలు, క్విజ్, ప్లనెటోరియం – జంతు ప్రదర్శనశాలల సందర్శనలు, వక్తృత్వ పోటీలు, ప్రయోగశాలల దర్శనాలు లాంటివి నిర్వహించుట ద్వారా నేటి యువత, రేపటి శాస్త్రవేత్తలకు ప్రేరణ దొరుకుతోంది. సైన్స్ పరిశోధనలతో మానవాళి జీవనశైలి సరళీకరించబడుతున్నది. శాస్త్రసాంకేతిక ప్రగతి వల్ల 'భూమి కుగ్రామమై అరచేతిలో స్మార్ట్ వైకుంఠం (గ్లోబల్ విలేజ్)' వెలసింది. భౌతిక దూరాలు సమసిపోయాయి. దేశాల సరిహద్దులు రేఖలుగానే మిగిలి పోయాయి. సైన్స్ పట్ల అవగాహన, దాని అనువర్తనాలను మానవాళి జీవన ప్రమాణాలు పెంచడానికి, దాని ప్రాధాన్యతలను విద్యార్థి లోకానికి వివరించే వేదికలుగా నేషనల్ సైన్స్ డే ఉపయోగపడాలి. మానవాళి సంక్షేమానికి సైన్స్ వినియోగం, విద్యార్థుల ఏకాగ్రతను వైజ్ఞానికశాస్త్రం వైపు ఆకర్షిస్తూ తమ కెరీర్‌గా సైన్స్ అండ్ టెక్నాలజీని తీసుకోవాలని సందేశాలు ఇవ్వాలి. సైన్స్ ఆవిష్కరణలకు ఇరువైపుల పదను ఉంటుంది. సైన్స్‌తో మానవ వికాసం మాత్రమే జరగాలి. ఒకవేళ సైన్స్ అనే ఆవిష్కరణల ఆయుధాలను వినాశనానికి వాడితే క్షణాల్లో ప్రపంచమే అంధకారంలోకి పడిపోయే మానవ ఉనికి ప్రమాదంలో పడుతుందని అందరం గమనించాలి.

నోబెల్ బహుమతి విజేత సర్. సి. వి. రామన్:

భారత్‌కు ప్రథమ సైన్స్ నోబెల్ బహుమతిని తెచ్చిన చంద్రశేఖర వెంకట రామన్ 07 నవంబర్ 1888న తమిళనాడులోని తిరుచిరాపల్లిలోని తమిళ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. విశాఖపట్నంలో పాఠశాల విద్య, మద్రాస్ విశ్వవిద్యాలయంలో బియస్సీ, యంయస్‌సి పూర్తి చేసి బంగారు పతకాలు పొందారు. 1907 నుంచి 1933 వరకు కలకత్తాలోని 'ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్'లో భౌతికశాస్త్ర పరిశోధనలు చేశారు. 28 ఫిబ్రవరి 1928న కాంతి ధర్మాలను, ముఖ్యంగా 'స్కాటరింగ్ ఆఫ్ లైట్'లో మరో శాస్త్రవేత్త కె.యస్. కృష్ణన్‌తో కలిసి చేసిన (పలు పారదర్శక పదార్థాల గుండా కాంతి ప్రయాణించినపుడు జరిగే కాంతి ధర్మాలలో మార్పులు) పరిశోధనల ఫలితంగా 'రామన్ ఎఫెక్ట్' అనబడే ప్రపంచ ప్రఖ్యాత ఫిజికల్ సైన్స్ దృగ్విషయం కనుగొనబడింది. తన శిష్యగణంలో జి.యన్. రామచంద్రన్, విక్రమ్ సారాభాయ్, శివరామకృష్ణన్, పంచరత్నమ్, శ్రీనివాస్ కృష్ణన్, రామనాథన్ లాంటి ఎందరో ప్రముఖ శాస్త్రవేత్తలు ఉన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం 'రామన్ రీసెర్చి ఇనిస్టిట్యూట్' ఏర్పాటు చేసి, పరిశోధనలు కొనసాగించిన 'సర్' గౌరవ బిరుదాంకితులు సి.వి.రామన్ భారత యువతకు దారి దీపం కావాలి. భారత ప్రభుత్వ అత్యున్నత "భారతరత్న" పురస్కార గ్రహీత అయిన సర్ సి.వి.రామన్ ప్రతిభను మెచ్చి ఫెల్లో ఆఫ్ రాయల్ సొసైటీ, నైట్ బాచిలర్, హుజెస్ మెడల్, లెనిన్ పీస్ ప్రైజ్ లాంటి ప్రత్యేక అంతర్జాతీయ గుర్తింపులు తనను వరించాయి.

21 నవంబర్ 1970న తుది శ్వాస విడిచిన మన వాడైన సర్ సి.వి.రామన్ జీవితం నేటి యువతకు ప్రేరణ కావాలని, వారు సూచించిన వైజ్ఞానికశాస్త్ర దిశగా యువ మేధలు కదలాలని ఆశిద్దాం, మరిన్ని వైజ్ఞానిక ఆవిష్కరణలకు కారణమవుదాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి-జిల్లా కలెక్టరు రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 27(నేటినిజం ప్రతినిధి): పార్లమెంటరీ సంస్థల పనితీరును యువత అర్థం చేసుకునేందుకు వీలుగా, యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖ ఎన్ వై కే ఎస్ ఔజఖా భారత దేశంలోని అన్ని రాష్ట్రాల్లో జిల్లా స్థాయిలో యూత్ పార్లమెంట్ నిర్వహించడం జరుగుతోంది. నెహ్రూ యువ కేంద్ర మెదక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27న జిల్లా స్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ (ఔజఒఖ) 2024, పట్టణంలోని వైస్రాయ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించడం జరిగిందని ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి ఏం రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టరు .రాజర్షి షా, జ్యోతి ప్రజ్వలన గావించి, స్వామి వివేకానంద పటానికి పూల మాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టరు రాజర్షి షామాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా వారు తమ పూర్తి సామర్థ్యాన్ని గ్రహించేలా మరియు ఈ ప్రక్రియలో దేశ నిర్మాణానికి సహకరించేలా ఇలాంటి వేదికలు ఉపయొగపడతాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి జాతీయ యువ పార్లమెంట్ ఫెస్టివల్ లో తెలంగాణ నుండి ద్వితీయ స్థానం గెలిచిన కుమారి నివేదితను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రశంసించి సన్మానించారు. నివేదిత డిల్లీలో జరిగే జాతీయస్థాయిలో పార్లమెంట్ హాల్లో నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ లో మార్చ్ తేదీన పాల్గొనన్నునందున జిల్లా కలెక్టర్ గారు నివేదితను అభినందించారు. యూత్ పార్లమెంట్ సెషన్‌లో లేవనెత్తిన అంశాలు యువత అభివృద్ధి, సామాజిక–ఆర్థిక అభివృద్ధి, శాంతి & భద్రతకు సంబంధించినవి, మానవ హక్కులు, ఆరోగ్యం మరియు విద్య, నైపుణ్యం, జీవనోపాధి, ఉపాధికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి అని సి.ఈ.ఓ జెడ్పి ఎల్లయ్య తెలిపారు.

నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ NYLP లక్ష్యాలు:

వివిధ స్థాయిలలో సంస్థాగత వేదికను రూపొందించడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యాలు, యువత వివిధ సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తీకరించడం మరియు వారి జీవితాలను ప్రభావితం చేసే అటువంటి సమస్యలు/ఆందోళనల పట్ల స్థానిక పరిపాలన దృష్టిని ఆకర్షించడం మరియు యువతకు ప్రత్యక్షంగా బహిర్గతం చేయడం. మాక్ పార్లమెంట్ ప్రోగ్రామ్ ద్వారా పార్లమెంటరీ విధానాల చట్రంలో తోటి యువతతో సంభాషణలో పాల్గొండం వలన, ప్రభుత్వం యొక్క వివిధ కార్యక్రమాల గురించి యువతకు అవగాహన మరియు దాని ప్రభావాన్ని చర్చించి మరియు వారి అనుభవాలు మరియు ఆలోచనలను పంచుకుంటుంది; పంచాయతీరాజ్ వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా యువతకు సంబంధించిన వివిధ సమస్యలపై చర్చ జరిపి, వివిధ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతోంది. వివిధ శాఖల జిల్లా అధికారులు తమ తమ శాఖల ద్వార ప్రజలకు లబ్ధి చేకూరే వివిద విధానాలు, సంస్కరణలు, ప్రభుత్వ పథకాల గూర్చి అవగహన కల్పించారు.

MYBHARAT పోర్టల్ రిజిస్ట్రేషన్ & బ్రీఫింగ్, న్యూ ఇండియాపై సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ సెషన్స్, న్యూ ఇనిషియేటివ్స్– చంద్రయాన్, కోవిడ్ వ్యాక్సినేషన్ మొదలైన వివిధ రంగాలలో ఇటీవలి కాలంలో దేశం సాధించిన వైజనిక మరియు సాంకేతిక విజయాల గురించి అవగాహన కల్పించడం జరిగినది. విజన్ ఆఫ్ ఇండియా ఏ2047, నారీశక్తి – మహిళా రిజర్వేషన్ మరియు మహిళల ప్రభావం నారీ శక్తి వందన్ అధినియం, జన్ ధన్ యోజన, బేటీ బచావో బేటీ పఢావో, స్వానిధి ద్వారా సాధికారత, స్థానిక సమస్యలపై మాక్ పార్లమెంట్ అనుకరణలో భాగంగా వివిధ కళాశాల యువత చురుగ్గా పాల్గొన్నారు భారత రాజ్యాంగం మరియు చట్టాలపై మెరుగైన జ్ఞానం మరియు అవగాహన.

ప్రపంచవ్యాప్తంగా, జాతీయ యువజన పార్లమెంటులు క్రియాశీల–పౌరసత్వాన్ని ప్రోత్సహించడానికి విశ్వసనీయమైన యంత్రాంగాలుగా ఉద్భవించాయి. ప్రపంచవ్యాప్తంగా యువత పార్లమెంటరీల నిర్మాణం, కూర్పు మరియు నిర్వహణ విధానాలలో తేడాలు ఉన్నప్పటికీ, యువతకు నిర్దిష్టమైన యువత సంబంధిత సమస్యలు మరియు ముఖ్యంగా, జాతీయ ప్రాముఖ్యత ఉన్న విషయాలపై వారి దృక్కోణాలను పంచుకోవడానికి ఆందోళనలను వ్యక్తీకరించడానికి వేదికలను అందిస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మరియు సుపరిపాలన సూత్రాలు మరియు ఆచరణలో యువకుల విజ్ఞానం, నైపుణ్యాలు మరియు సామర్థ్యాలను పెంపొందించడంలో యూత్ పార్లమెంట్‌లు నిజానికి కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి గౌరవ అధిథులుగా జిల్లా అధికారులు ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి ఏం రంజిత్ రెడ్డి, పిడి డిఆర్డిఏ శ్రీనివాస్, సూపర్డెంట్ పోస్టల్ డిపార్ట్మెంట్ శ్రీహరి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కృష్ణమూర్తి, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ నాగరాజు, జిల్లా మహిళ మరియు శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యక్రమ అధికారి జి కిరణ్ కుమార్, డాక్టర్ కే హుస్సేన్ ప్రిన్సిపల్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, ఏ ఆర్ ఈ ఎస్ ఎన్జీవో శ్రీమతి సునీత, సఖి వన్ స్టాప్ సెంటర్ శ్రీమతి రేణుక, ప్రొఫెసర్ వెంకటేశం, ప్రొఫెసర్ శరత్ రెడ్డి, ఎన్ సి సి ఏఎన్ఓ సుధాకర్, యువజన సంఘ అధ్యక్షుడు అధికం రాజు గౌడ్ మరియు ఎన్ వై కే వాలంటీర్లు సాయిరాం, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనతో ప్రజలకు న్యాయం-పరికపల్లి శ్రీనివాస్

ఖమ్మం, ఫిబ్రవరి 27(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ కొనిజర్ల మండల నాయకులు పరికపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజాపాలన లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. నాటి వైయస్సార్ పాలనను మరిపించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉంటుందన్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు, ధరణిలో పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారం, ప్రభుత్వ ఉద్యోగాల కల్పన తదితర పనులతో పాటు ఆరు గ్యారెంటీ హామీలను ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని ఆయన అన్నారు.

# ఆత్మకూరు ఎస్.ఐ సస్పెండ్...ఉత్తర్వులు జారీ చేసిన సిపి

వరంగల్, ఫిబ్రవరి 27: వరంగల్ పోలీస్ కమిషనరేట్లోని ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బి ఆర్ ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేసి ఎస్సై దుర్గాప్రసాద్ అనుచితంగా, అమానుషంగా ప్రవర్తిం చారంటూ బి ఆర్ ఎస్ నేతలు కడియం శ్రీహరి, చల్లా ధర్మారెడ్డిలు సీరియస్ గా స్పందించారు. ఎస్సైని సస్పెండ్ చేయాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. పోలీస్ అధికారులు సానుకూలంగా స్పందించకపోతే ఈనెల 28న, చలో ఆత్మకూరు ఆందోళన కార్యక్రమంకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు ప్రాథమిక విచారణ జరిపి సదరు ఎస్సై పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని చేసిన సిఫార్సుల మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సస్పెండ్ వేటు వేశారు.

# విశాఖకు చేరుకున్న నారా భువనేశ్వరీ..



అమరావతి, ఫిబ్రవరి 27:నేటి నుంచి నాలుగు రోజులు ఉత్తరాంధ్రలో నారా భువనేశ్వరీ పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా నారా భువనేశ్వరీ విశాఖకు చేరుకున్నారు. ఆమెకు విశాఖ విమానాశ్రయంలో టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. వి విమానాశ్రయం నుండి సాలూరుకు భువనేశ్వరీ బయలుదేరనున్నారు. సాలూరు సిటీలో ఎన్టీఆర్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించనున్నారు.

### ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు 2024

# డిజిటల్ లావాదేవీల పై అవగాహన,సైబర్ నేరాల పట్ల అప్రమత్తం గా ఉండాలి -జిల్లా కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 27(నేటినిజం ప్రతినిధి): ఈనెల 26 తేదీ నుండి మార్చి ఒకటో తారీకు వరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహినీచు ఆర్థిక అక్షరాస్య వారోత్సవాలను లీడ్ బ్యాంకు మెదక్ ఆధ్వర్యంలో నిర్వహించ బడు చున్నవి. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రజలందరూ బ్యాంకు సేవలను వినియోగించుకోవడం మరియు బ్యాంకు లావాదేవీలు అనగా ఆర్థిక డిజిటల్ లావాదేవీల పట్ల అవగాహన మరియు సైబర్ నేరాల పట్ల అప్రమత్తం గా వ్యవహరించడం. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొని జెండా ఊపి 2ని పాదయాత్రను ప్రారంభించినారు. ఈ కార్యక్రమానికి లీడ్ బ్యాంకు మేనేజరు నరసింహ మూర్తి ఈఒఅ కౌన్సిలర్ ,జిల్లా అధికారులు బ్యాంక్ అధికారులు సిబ్బంది పాల్గొని విజయవంతం చేసినారు.

# నేడే ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

### -గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి -ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ

మెదక్, ఫిబ్రవరి 27(నేటినిజం ప్రతినిధి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 28 నుండి మార్చ్ 16 వరకు జరగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 9 నుండి 12 గంటల వరుకు పరీక్షలు జరుగుతాయి. ఈ సారి కూడా నిమిషం నిబంధన అమలు లో ఉంటుందని, విద్యార్థుల ందరూ 8 గంటల వరకు పరీక్షా కేంద్రాల కు చేరుకోవాలని, ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు హాల్ టికెట్స్ విద్యార్థులకు జారీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలుంటాయని, విద్యార్థులందరూ తమ హాల్ టికెట్స్ నెట్ సెంటర్ నుండి కూడా పొందవచ్చని, ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరు కావాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. జనరల్ విభాగం లో 13,172 విద్యార్థులు, ఒకేషనల్ విభాగం లో 656 విద్యార్థులు పరీక్షలు హాజరు కానున్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి అన్ని పరీక్షా కేంద్రాల లో సి సి కెమెరాలను ఏర్పాటు చేసాము. పరీక్షలను పర్యవేక్షిం చడానికి, జిల్లా కలెక్టర్ ఆద్వర్యం లోని హై పవర్ కమిటీ తో పాటు జిల్లా పర్యవేక్షణ కమిటీ ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం , నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్షలలో విద్యార్థులు ఎవరికీ కూడా ఎలక్ట్రానిక్ చేతి గడి యారాలు, మొబైల్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదని తెలిపారు. పరీక్షలకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయం హెల్ప్ లైన్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9603615 652 / 76710333232 సంప్రదించాలని తెలిపారు. ఇంటర్ పరీక్షలలో ఒత్తిడిని ఎదుర్కోవడానికి టెలి మానస్ కార్యక్రమం లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ 14416 / 180091441655 కి కాల్ చేసి మానసిక నిపుణుల ద్వారా కౌన్సిలింగ్ పొందవచ్చని పేర్కొన్నారు.

# హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో భారీ బదిలీలు..

హైదరాబాద్, ఫిబ్రవరి 27:సిటీలో 71 మంది ఎస్ఐలను, ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చాదర్‌ఘాట్ ఎస్‌హెచ్ఓ వై.ప్రకా?షరెడ్డిని మల్టీజోన్ 2కు, మారేడుపల్లి ఎస్ హెచ్ ఓ డి.శ్రీనివాసరావును ఎస్‌బీకి అటాచ్ చేశారు.

# 2027 నాటికి భారత్ మూడో ఆర్థికశక్తిగా ఎదుగుతుంది..

### – రక్షణశాఖ మంత్రి రాజనాథ్ సింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 27: 2027 నాటికి ప్రపంచ దేశాల్లోనే





భారత్ మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజనాథ్ సింగ్ అన్నారు. విశాఖలోని భారత్ రైజింగ్ ఎలైట్ పేరిట మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ?. భాష, ప్రాంతీయ వాదం పేరుతో దేశ సమగ్రతకు నష్టం కలిగించే చర్యలు అడ్డుకోవాలని, సౌత్, నార్త్ ఇండియా పేరుతో విభజన కోసం రాజకీయ కుట్రలు జరుగుతున్నాయన్నారు. బీజేపీ ఉత్తరాది పార్టీ కనుక దక్షిణాదిలో పనేంటిని అడుగుతునారని, హిందీ మాట్లాడని రాష్ట్రాల్లోనూ తాము అధికారంలో ఉన్నామన్నారు. ఏపీలో బీజేపీకి గతం కంటే ఓటు బ్యాంక్ పెరిగిందని, బీజేపీ ఏదో ఒక రోజు అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కుటుంబ పాలన, అవినీతి అనే అంశాలు కాంగ్రెస్ పార్టీకి అమ్మలాంటివి అని రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు.

రాఫెల్ విమానాలను అడ్డుకునే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తే దేశీయ నైపుణ్యంతో అద్భుతమైన ఉత్పత్తిని సాధిస్తున్నామన్నారు. కేవలం రాజకీయాల కోసమే భారత జనతా పార్టీ లేదని, దేశాన్ని ప్రపంచ అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ట్రిపుల్ తలాక్, సివిల్ కామన్ కోడ్, అయెధ్య రామ మందిరం, ఆర్టిక్ 370 వంటి సాహసోపేత నిర్ణయాలు బీజేపీ అమలు చేసిందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంతో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా అవతరించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రపంచంలోని యూరప్, అమెరికా వంటి దేశాలు సైతం ఆర్థికలోటు విషయంలో ఇబ్బందులు పడుతుంటే మోడీ చొరవతో భారత్‌లో ఆర్థికలోటును నియంత్రిం చగలిగావన్నారు. స్వప్రయోజనాల కంటే దేశ ప్రయోజానాలే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ బీజేపీ అన్ని పార్టీల కంటే భిన్నమైనదని, పేదరిక నిర్మూలన, మహిళల రక్షణ, సాధికారతే లక్ష్యంగా పనిచేస్తున్నావన్నారు. ప్రధానమంత్రి స్వయం సహాయ యోజన, ముద్ర రుణాలను వినియోగించుకుంటూ మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. 2014 ముందు అప్పటి కేంద్ర ప్రభుత్వంలో కేవలం స్కామ్‌లు మాత్రమే ఉండేవని, మోడీ అధికారం లోకి వచ్చాక స్కీమ్‌లు అందుతున్నా యన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని, కేవలం లాభాల బాటలో పయనించే విధంగా కేంద్రం అడుగులు వేస్తుందన్నారు. ఇక విశాఖ రైల్వే జోన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో భూమి కేటాయించకుండా ఆయా నెపాన్ని కేంద్రంపై నెట్టడం సరికాదన్నారు.

ఏపీ అభివృద్ధిని అగ్రగామిలో నిలబెట్టేందుకు తాము కట్టుబడి ఉన్నామని, అవినీతికి తావులేని పాలన అందిస్తామని, వచ్చే ఎన్నికల్లో తమను ఆశీర్వదించాలన్నారు. ఆంధ్రాలో ఒక్కసారి. కేంద్రంలో మరోసారి కేంద్ర సర్కార్ పేరిట ఎన్నికల ప్రచారాన్ని చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశం లో రాజ్యసభ్య సభ్యులు జీవిఎల్ నరసింహారావు, సిఎం రమేష్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పివిఎన్ మాధవ్, పి.విష్ణుకుమార్ రాజు, కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, విశాఖ జిల్లా బీజేపీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రతో పాటు, పలువురు మహిళా ప్రతినిధులు, మేధావులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ శివ మహా పూజలు



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27: మక్తల్ పట్టణంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద శివమాల దీక్షపరుల 24వ శ్రీ శివ మహాపూజ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఇవాళ అర్చకులు శివ ఆధ్వర్యంలో శివమలదారుల గురుస్వామి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 24వ శ్రీ శివ మహాపూజ సందర్భంగా పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం నుండి పట్టణ పురవీధుల గుండా శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం వరకు కలశ ఊరేగింపు నిర్వహించారు. దారిపొడవునా భక్తులు కలశ ఊరేగింపు స్వాములకు నిండు నీటి బిందెలతో నీళ్లు పారబోసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్ద జరిగిన మహా పూజ వేడుకల్లో శివుడికి అభిషేకం, బిల్వార్చన, విశేష పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఉడిపి పెజవర మఠం తెలంగాణ ఆంధ్ర ధర్మ ప్రచారక్ విద్వాన్ రాఘవేంద్ర ఆచార్య పాల్గొని పరమశివుడి గొప్పదనాన్ని మనిషిలోని దుర్గుణాలు, సద్గుణాలను వివరించారు. భగవంతుడి నామస్మరణ ప్రతిరోజూ చేయాలని సూచించారు. శివ నామస్మరణ ప్రతినిత్యం చేయాలన్నారు. గోమాతను పూజించాలని హిందువుల చిరకాల వాంఛ అయినటువంటి అయోధ్య రామ మందిర నిర్మాణం పూర్తి కావడం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకలు జరుపుకోవడం జరిగిందన్నారు. శివదీక్షాపరుల సంకల్పంతో త్వరలో కాశీ విశ్వనాథుడి ఆలయ పునర్నిర్మాణం కూడా పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో మక్తల్ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన శివ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

# ఘనంగా సామూహిక ఉపనయన కార్యక్రమం



హైదరాబాద్, ఫిబ్రవరి 27:హైదరాబాద్‌లోని కుసుమ హరనాథ్ ఆశ్రమంలో సోమవారం సామూహిక ఉపనయన కార్యక్రమం ఘనంగా జరిగింది. సుమారు 40 మంది బ్రాహ్మణ వటువులకు ఉపనయనం చేయగా.. వేములవాడ, శ్రీశైల క్షేత్రాలకు చెందిన పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమం నిర్వహించారు.

వేములవాడ బ్రాహ్మణ భాగ్యనగర సమితి (ఏఃబా) సరూర్‌నగర్ కేంద్రంగా 2020 నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నది. ఉపనయనానికి వచ్చే వటువులకు ముందురోజు వసతి కల్పించడంతో పాటు కార్యక్రమానికి అవసరమైన దీక్షావస్త్రాలతో సమకూరుస్తున్నది. ఈ సందర్భంగా సంధ్యావందనం ఎలా ఆచరించాలో తెలిపే.. రుగ్వేద, యజుర్వేద విధాన సంధ్యావందనం పుస్తకాల కూడా ఉచితంగా నిర్వాహకులు అందచేశారు. కార్యక్రమం అనంతరం వటువులతో పాటు తల్లిదండ్రులు, బంధువులకు ఉచిత భోజన ప్రసాదం అందజేశారు. అలాగే, వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆశీస్సులు, తీర్థప్రసాదాలను అందజేశారు.

# బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కు దీపాదాస్ మున్షీ లీగల్ నోటీసులు

హైదరాబాద్ ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కు కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ షాక్ ఇచ్చారు. ప్రభాకర్‌కు ఆమె లీగల్ నోటీసులు పంపారు. ఇటీవల ఎన్‌వీఎస్ ప్రభాకర్ కాంగ్రెస్ నేతల నుంచి బెంజ్‌కారు లబ్ధి పొందినట్లు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె ఎలాంటి ఆధారాలు లేకుండా నిరాధార ఆరోపణలు చేశారని ఆరోపించారు. ఆరోపణలపై రెండురోజుల్లో ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రూ. 10కోట్లకు పరువు నష్టం దావా చేయనున్నట్లు దీపాదాస్ మున్షీ హెచ్చరించారు. తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జీగా ఉన్న మాణిక్‌రావు ఠాక్రే స్థానంలో దీపాదాస్ మున్షీని డిసెంబర్‌లో కాంగ్రెస్ నాయకత్వం నియమించింది. అయితే, త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఎంపీ టికెట్ ఆశావాహుల్లో ఒకరు దీపాదాస్ మున్షీకి బెంజ్ కార్‌ను బహూకరించినట్లు ఆరోపించారు. దీపాదాస్‌కు బెంజ్ కారు కొనివ్వడంపై తనవద్ద పక్కా సాక్ష్యాధారాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఎంపీ టికెట్ కోసం ఆమె ఎవరు కారును గిఫ్ట్‌గా ఇచ్చారన్నది మాత్రం ఆయన వెల్లడించలేదు. దీపాదాస్ మున్షీపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు. దీపాదాస్ మున్షీ, ఆమెకు గిఫ్ట్ ఇచ్చిన నేతలు స్పందిస్తేనే తాను సమాధానం చెబుతానని, ఆధారాలు చూపిస్తానన్నారు. ఈ క్రమంలోనే తనపై చేసిన ఆరోపణలపై దీపాదాస్ మున్షీ బీజేపీ నేతకు లీగల్ నోటీసులు పంపారు.

# నేడు పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి పర్యటన



ఖమ్మం, ఫిబ్రవరి 27(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజక వర్గంలో బుధవారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం పది గంటలకు తిరుమలాయపాలెంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఆ మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. పదకొండు గంటలకు కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడంతో పాటు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తానని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలో మినీ క్రీడా మైదానానికి శంకుస్థాపన చేసి మండలంలోని కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే సాయంత్రం ఐదు గంటలకు 59వ డివిజన్ దానవాయిగూడెంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# అనారోగ్యంతో సమ్మక్క తల్లి పూజారి సిద్దబోయిన దశరథం మృతి

ములుగు ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జిల్లాలోని మేడారం సమ్మక్క, సారలమ్మ తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. సమ్మక్క తల్లి పూజారి సిద్దబోయిన దశరథం అనారోగ్య కారణాలతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. కొద్ది రోజుల క్రితం దశరథం అన్న సిద్దబోయిన లక్ష్మణరావు సైతం అనారోగ్య కారణాలతో మరణించారు. స్వల్ప వ్యవధిలోనే అన్నదమ్ముల మరణంతో మేడారం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా, దశరథం మృతిపట్ల పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. స్వల్ప వ్యవధిలోనే సోదరులిద్దరు మృతి చెందడం బాధాకరమన్నారు.

# మార్చి 1న బీఆర్ఎస్ పార్టీ ఛలో మేడిగడ్డ.. పిలుపు ఇచ్చిన కేటీఆర్




హైదరాబాద్, ఫిబ్రవరి 27:కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజలను కాంగ్రెస్ నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డే అన్నట్టు ప్రచారం చేస్తున్నారన్నారు. తెలంగాణ రైతాంగానికి కామధేనువు.. తెలంగాణకు జీవధార కాళేశ్వరం అని వ్యాఖ్యానించారు.

కాళేశ్వరం ప్రాజెక్టును ఆపడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా కేసీఆర్ దీన్ని పూర్తి చేశారని చెప్పారు. మార్చి 1న ఛలో మేడిగడ్డ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు గురించి వివరిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలో మొత్తం 84 పిల్లర్లు ఉంటే అందులో 3 కుంగిపోయాయని, మూడు పిల్లర్లు కుంగితే బ్యారేజీ మొత్తం కొట్టుకుపోయినట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణకు నీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ కన్నీళ్లు పెట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో వందల కిలో మీటర్లు గోదావరి నది ప్రవహిస్తున్నా గతంలో తెలంగాణ ఎడారిగా ఉండేదన్నారు. 'తలాపున పారుతోంది గోదావరి.. మన చేను, 'సేలక ఎడారి' అని పాఠాలు రాశారని గుర్తు చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ జలయజ్ఞం చేపట్టిందని.. కానీ అది జలయజ్ఞం కాదు ధనయజ్ఞం అని ఎద్దేవా చేశారు. ఆనాడు 52 వేల కోట్ల అవినీతి జరిగిందని కాగ్ రిపోర్ట్ ఇచ్చిందన్నారు. అప్పట్లో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ అన్యాయం జరిగిందంటూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ గర్జించిందని గుర్తు చేశారు. కేంద్రం, ఏపీ, మహారాష్ట్రలోనూ కాంగ్రెస్ అధికారంలోకి ఉన్నా ప్రాజెక్టుల కోసం అనుమతులు తీసుకురాలేదని విమర్శించారు. తమ్మిహట్టి అన్నారు, తట్టెడు మట్టి తీయలేదు.. కనీసం మహారాష్ట్రతో అంతరాష్ట్ర ఒప్పందం కూడా చేసుకోలేదని ధ్వజమెత్తారు. మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరుతో క్రాంటాక్టర్లకు రూ.52 వేల కోట్లు కట్టబెట్టారని ఆరోపించారు. ఆనాటి కాంగ్రెస్ సర్కార్ పదేళ్లు టైమ్ పాస్ చేసిందని సీరియస్ అయ్యారు. గోదావరి నీళ్లను తెలంగాణకు మళ్లించేందుకు కేసీఆర్ భగీరథ ప్రయత్నం చేశారని చెప్పారు.

తమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్ర జలసంఘం చెప్పిందని గుర్తు చేశారు. తమ్మిడిహట్టి కంటే మేడిగడ్డ వద్దే నీటి లభ్యత ఎక్కువ అని చెప్పిందని.. మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఎక్కువ కాబట్టే కాళేశ్వరం ప్రారంభించామని స్పష్టం చేశారు. కాళేశ్వరం నిర్మించడం కోసం మహారాష్ట్రతో వివాదం ఉన్నా సామరస్యంగా పరిష్కారించామని తెలిపారు. కాళేశ్వరం అంటే ఒక మేడిగడ్డనే కాదని అన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు మళ్లీ జీవం వచ్చిందంటే కారణం కాళేశ్వరమేనని, కాళేశ్వరం 40 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే కామధేనువు అని కీలక వ్యాఖ్యలు చేశారు.

# ఎంపీ వద్దిరాజు దంపతులు దర్శన్- సిద్దిలకు ఆశీస్సులు



ఖమ్మం, ఫిబ్రవరి 27(నేటినిజం ప్రతినిధి): రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర-విజయలక్ష్మీ దంపతులు నూతన వధూవరులు దర్శన్-సిద్దిలను ఆశీర్వదించారు. దర్శన్-సిద్దిల పెళ్లి ఈనెల 24వ తేదీన శనివారం పుణేలో జరుగగా, సోమవారం రాత్రి శంషాబాద్ క్లాసిక్-3 కన్వెన్షన్ హాలులో విందు ఏర్పాటు చేశారు. ఈ శుభకార్యానికి ఎంపీ రవిచంద్ర-విజయలక్ష్మీ దంపతులు హాజరై నూతన వధూవరుల చేత పూలదండలు మార్పించి ఆశీస్సులు అందజేశారు. వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తమ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, లోకసభ సభ్యులు బీ.బీ.పాటిల్, ఎంపీ రవిచంద్ర సన్నిహితులు ముద్దు వినోద్, మరికల్ పోత సుధీర్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# భారతదేశ స్వంత గుర్తింపును సృష్టించే దిశగా ఒక పెద్ద ముందడుగు కానున్న కస్తూరి కాటన్: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న్యూ ఢిల్లీలోని భారత్ మండపంలో దేశంలో అతిపెద్ద గ్లోబల్ టెక్స్‌టైల్ ఈవెంట్‌లలో ఒకటైన భారత్ టెక్స్ 2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌ను కూడా ప్రధాని తిలకించారు.

సభను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి భారత్ టెక్స్ 2024కి ప్రతి ఒక్కరికి స్వాగతం పలికారు. భారత్ మండపం మరియు యశోభూమి అనే రెండు అతిపెద్ద ఎగ్జిబిషన్ సెంటర్లలో ఈ ఈవెంట్ జరుగుతున్నందున ఈ రోజు ప్రత్యేకమైనదని అన్నారు. దాదాపు 100 దేశాల నుండి 3000 మందికి పైగా ఎగ్జిబిటర్లు మరియు వ్యాపారులు మరియు దాదాపు 40,000 మంది సందర్శకులు ఉన్నారని, వారందరికీ భారత్ టెక్స్ ఒక వేదికను అందిస్తుంది అని ప్రధాని తెలిపారు.

నేటి కార్యక్రమం అనేక కోణాలతో కూడుకున్నదని ప్రధాన మంత్రి అన్నారు. 'భారత్ టెక్స్ థ్రెడ్ భారతీయ సంప్రదాయం యొక్క అద్భుతమైన చరిత్రను నేటి ప్రతిభతో అనుసంధానిస్తుంది; సంప్రదాయాలతో కూడిన సాంకేతికత మరియు శైలి/సుస్థిరత/స్థాయి/నైపుణ్యాన్ని ఒకచోట చేరుస్తుంది. భారతదేశం అంతటా ఉన్న అనేక వస్త్ర సంప్రదాయాలను కలిగి ఉన్న ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌కు గొప్ప ఉదాహరణగా కూడా ప్రధాని వివరించారు. భారతదేశ వస్త్ర సంప్రదాయ విశిష్టత మరియు సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి వేదికపై జరిగిన ప్రదర్శనను కూడా ఆయన ప్రశంసించారు.

టెక్స్‌టైల్ వాల్యూ చైన్‌లో వివిధ వాటాదారుల ఉనికిని ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ..భారతదేశ టెక్స్‌టైల్ రంగాన్ని అర్థం చేసుకోవడంతోపాటు సవాళ్లు మరియు ఆకాంక్షల గురించి తెలుసుకోవడంలో వారి తెలివితేటలను ప్రధాన మంత్రి హైలైట్ చేశారు. వాల్యూ చైన్‌కు కీలకమైన నేత కార్మికుల ఉనికిని మరియు క్షేత్రస్థాయి నుండి వారి అనుభవాన్ని కూడా ఆయన గుర్తించారు. వారిని ఉద్దేశించి ప్రధాని ప్రసంగిస్తూ..వికసిత భారత్ మరియు దాని నాలుగు ప్రధాన స్తంభాల సంకల్పాన్ని నొక్కిచెప్పారు. భారతదేశ వస్త్ర రంగం పేదలు, యువత, రైతులు మరియు మహిళలు ప్రతి ఒక్కరితో అనుసంధానించబడి ఉందని హైలైట్ చేశారు. అందువల్ల, భారత్ టెక్స్ 2024 వంటి ఈవెంట్ యొక్క ప్రాముఖ్యత మరింత పెంగుతుందని ప్రధాన మంత్రి అన్నారు.

పత్తి, జనపనార మరియు పట్టు ఉత్పత్తిదారుగా భారతదేశం అభివృద్ధి చెందుతున్న ప్రొఫైల్ గురించి మాటాడుతూ..ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతు ఇస్తోందని మరియు వారి నుండి పత్తిని కొనుగోలు చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన కస్తూరి కాటన్ ప్రపంచవ్యాప్తంగా భారతదేశ బ్రాండ్ విలువను సృష్టించడంలో పెద్ద ముందడుగు అని ఆయన అన్నారు. జూట్ మరియు సిల్క్ రంగానికి సంబంధించిన చర్యలను కూడా ప్రధాన మంత్రి ప్రస్తావించారు. టెక్నికల్ టెక్స్‌టైల్స్ వంటి కొత్త రంగాల గురించి కూడా మాట్లాడారు. నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ మిషన్ గురించి మరియు ఆ రంగంలో స్టార్టప్‌ల అవకాశాల గురించి తెలియజేశారు. వివిధ రాష్ట్రాల్లో ఏడు పిఎం మిత్రా పార్కులను రూపొందించడానికి ప్రభుత్వం విస్తృత ప్రణాళికలను ప్రధాన మంత్రి వివరించారు. మొత్తం వస్త్ర రంగానికి అవకాశాల కల్పనపై ఉద్ఘాటించారు. "ప్లగ్ అండ్ ప్లే సౌకర్యాలతో కూడిన ఆధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చిన ఒకే స్థలంలో మొత్తం విలువ గొలుసు పర్యావరణ వ్యవస్థను స్థాపించడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది" అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. ఇది స్కేల్ మరియు ఆపరేషన్‌ను మెరుగుపరచడమే కాకుండా లాజిస్టిక్స్ ఖర్చులను కూడా తగ్గిస్తుందని తెలిపారు.

గ్రామీణ జనాభా మరియు టెక్స్‌టైల్స్ రంగాలలో మహిళల ఉపాధి సామర్థ్యాలు మరియు భాగస్వామ్యాన్ని ప్రస్తావిస్తూ 10 మంది దుస్తుల తయారీదారులలో 7 మంది మహిళలు మరియు చేనేతలో వారి సంఖ్య మరింత ఎక్కువగా ఉందని ప్రధాన మంత్రి అన్నారు. గత 10 ఏళ్లలో తీసుకున్న చర్యలు ఖాదీని అభివృద్ధి మరియు ఉద్యోగాలకు బలమైన మాధ్యమంగా మార్చాయని ఆయన ఉద్ఘాటించారు. అదే విధంగా గత దశాబ్దంలో సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల పెంపు జౌళి రంగానికి కూడా మేలు చేకూర్చాయని చెప్పారు. కేంద్ర జౌళి, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజాపంపిణీ, వాణిజ్యం ఉ పరిశ్రమ ల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ తన స్వాగత ప్రసంగంలో గ్లోబల్ టెక్స్‌టైల్ ఎక్స్‌పో దేశంలోనే తొలిసా రిగా నిర్వహించబడుతున్న అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ ఈవెంట్ అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దృష్టిలో 5 ఎఫ్ అంటే వ్యవసాయం నుండి ఫైబర్, ఫైబర్ నుండి ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ నుండి ఫ్యాషన్ మరియు ఫ్యాషన్ నుండి విదేశీ మార్కెట్లకు మొత్తం వస్త్ర విలువ గొలుసును కవర్ చేస్తుందని మంత్రి తెలియజేశారు. స్థానిక సరఫరా గొలుసులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మరియు 3ఎస్ అంటే స్కిల్, స్పీడ్ మరియు స్కేల్‌కు 'వికసిత భారత్' దృక్పథాన్ని నెరవేర్చడానికి ఎక్కువ ప్రాధాన్యత అవసరమని ఆయన అన్నారు. 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులతో పాటుగా భారతదేశం 250 బిలియన్ డాలర్ల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి బలమైన సరఫరా గొలుసులు సహాయపడతాయని శ్రీ గోయల్ పేర్కొన్నారు. గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌లో టెక్స్‌టైల్ పరిశ్రమ యొక్క మొత్తం విలువ గొలుసును ఒకచోట చేర్చి ప్రదర్శించడానికి ఎక్స్‌పో చేయగలిగిందని శ్రీ గోయల్ చెప్పారు. ప్రపంచ టెక్స్‌టైల్ పవర్‌హౌస్‌గా భారతదేశం యొక్క స్థానాన్ని పునరుద్ఘాటిస్తుందన్నారు. ఈ కార్యక్రమం భారతదేశాన్ని ఆకర్షణీయ మైన పెట్టుబడి మరియు సోర్సింగ్ గమ్యస్థానంగా నిలబెడుతుందని ఆయన తెలిపారు. తన 'వోకల్ ఫర్ లోకల్' మంత్రం ద్వారా స్థానిక ఉత్పత్తులకు మద్దతిచ్చేలా దేశాన్ని సమీకరించడమే కాకుండా 'లోకల్ ఫర్ గ్లోబల్' చొరవ తీసుకునేలా వారిని ప్రోత్సహించినందుకు ప్రధానిని ఆయన అభినందించారు. ప్రభుత్వం తన వివిధ కార్యక్రమాలైన - పిఎం మిత్ర, ఉత్పత్తి-లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్ఐ) పథకం, సమర్థ్ (టెక్స్‌టైల్స్ సెక్టార్‌లో కెపాసిటీ బిల్డింగ్ స్కీమ్) మరియు నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ మిషన్ పరిశ్రమకు భారీ ప్రోత్సాహాన్ని అందించిందని మంత్రి చెప్పారు. పత్తి మరియు మానవ నిర్మిత ఫైబర్ పరిశ్రమకు ఎండ్-టు-ఎండ్ కనెక్టివిటీని రూపొందించడానికి టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ కొత్త టెక్స్‌టైల్ అడ్వైజరీ గ్రూప్‌ను ఏర్పాటు చేసిందని, ఇది బ్యాలెన్స్‌ను నిర్వహించడానికి మరియు టెక్స్‌టైల్ రంగంలో మెరుగైన సినర్జీని సృష్టించడానికి సహాయపడుతుందని ఆయన అన్నారు.

# ప్రభుత్వ విద్యా వ్యవస్థ బాగుపడే దెన్నడు ?

## -ఆధారాలు చూపినా చర్యలు లేవా ?

## -ప్రశ్నించిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి

హైదరాబాద్ ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రభుత్వ ఉపాధ్యాయులై ఉండి ప్రైవేటు వ్యాపారాలు వెలగ పెడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్తను కొందరు భ్రష్టు పట్టిస్తున్నారని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి పేర్కొంది. ఆధారాలతో పిర్యాదు చేసినా విచారణల పేరుతో తూతూ మంత్రంగా కాలయాపన చేస్తూ వ్యవహరిస్తున్న అధికారుల తీరు విద్యా వ్యవస్తను భ్రష్టు పట్టించడంలో 'తిలా పాపం తలా పిడికెడు" అన్నట్టుగా ఉందని విద్యా పరిరక్షణ కమిటి నేతలు తిరువరంగం ప్రభాకర్,సిహెచ్ మధుసూదన్ రెడ్డి,కటంగూరు సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మీడియా సమావేశం లో వారు మాట్లాడుతూ పర్యవేక్షణ లోపం, కఠినమైన నిర్ణయాలు తీసుకోవడంలో అధికారుల అలసత్వం వెరసి ప్రభుత్వ విద్యావ్యవస్థ నానాటికి దిగజారుతుందని వారు ఆందోళన వ్యక్తం చేసారు. ఏకంగా విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం స్వంత జనగామ జిల్లా లోని పాలకుర్తి మండలంలోని ఎంపీపీఎస్ 'కంబాలకుంట తండా' లో పని చేస్తున్న ఉపాధ్యాయుడి వ్యవహారం ఆదినుండి వివాదాస్పదమే. అతని అప్పాయింట్ మెంట్ కూడా సందేహాస్పదమే. ఇనుగాల దేవేందర్ రెడ్డి అనే అతనుఅతడి తండ్రి పేరు వెంకట రెడ్డా? లేక సంజీవ రెడ్డా? ఏది నిజం? ఏది చట్టసమ్మతం? ఇతనికి ఏ తండ్రి పేరుతో ఉద్యోగం లభించిందని వారు ప్రశ్నించారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి గాని, అతని సంబందికులు గాని 'కోడ్ ఆఫ్ కాండక్ట్ నియమనిబంధనల ప్రకారం ఎలాంటి ప్రైవేటు వ్యాపారాలు చేయరాదు. కాని అతడి కుటుంబీకులతో పాటు అతను అనునిత్య కృత్యాలు, యవ్వారాలు వెలగబెడుతున్నది ఓ రెండు రిజిస్టర్డ్ ప్రైవేటు ప్రైవేటు విద్యా వ్యవస్థలలో, అందులో ఒకటి "విభావిని విద్యా సమితి, మడికొండ (రి.నం. 540/1991, తేది: 19.02.1991)". ప్రభుత్వ ఉపాధ్యాయుడయివుండీ ఫాదర్ ఇనుగాల సంజీవ రెడ్డి పేరుతో, గత 25 సంవత్సరాలుగా వరంగల్ జిల్లా కోర్టులో రెండు కేసులు, హైద్రాబాద్ హై కోర్టులో రెండు కేసులలో కీలక వ్యక్తి గా ఉన్నట్లు వారు తెలిపారు. మరొకటి " ఎస్ఎల్ఎన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, హనుమకొండ (రి.నం.89/ 2002, తేది: 06.01.2016)" యందు, తన ఫాదర్ ఇనుగాల వెంకట రెడ్డి పేరుతో ఎగ్జిక్యూటివ్ మెంబర్, అతడి భార్య ఇనుగాల అరుణ ప్రధాన కార్యదర్శి, అతడి పెద్ద కుమారుడు ఇనుగాల అమితేశ్ రెడ్డి ఉపాధ్యక్షుడు, చిన్న కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి మరో ఎగ్జిక్యూటివ్ మెంబర్, ఇద్దరు కొడుకులు విదేశంలో నివసిస్తూ "హఒఔ ఎడ్యుకేషనల్ సొసైటీ, హనుమకొండ''లో కార్యనిర్వాహక కమిటీ సభ్యులన్నారు. ఆధార్, ఓటరు, డ్రైవింగ్ లిసిఒన్ లైసెన్స్ తదితర గుర్తింపు కార్డులు ఏ ఫాదర్ పేరుతో జారీ చేయబడినవి? ప్రభుత్వ పరంగా పొందే జీతభత్యాలు, ప్రభుత్వ రాయితీలు, ఏ బ్యాంకు అకౌంట్స్ ద్వారా, ఏ ఫాదర్ పేరున పొందుతున్నట్లు? ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిజేస్తూ, ప్రైవేటు విద్యా సంస్థలలో, కోర్టు కేసులలో ఇద్దరు ఫాదర్స్ పేరుతో చలామణి కావడం ఇతడికి మాత్రమే ఎలా చెల్లుతోందని వారు ప్రశ్నించారు. విద్యార్థులనమోదు శాతాన్ని పెంచి, విద్యా బుద్దులు నేర్పించాల్సిన సదరు ఉపాధ్యాయుడు ఏళ్లతరబడి బదిలీలు లేక ఒకే పాఠశాల లో పాతుకు పోయి గొర్రెల, కోళ్ళ పెంపకాన్ని మాత్రం ఇష్టంగా నిర్వహిస్తాడనేది తండా వాసులు చెబుతారు. పాలకుర్తి మండలంలోని ఎంపీపీఎస్, 'కంబాలకుంట తండా పాఠశాల లో కేవలం 16 మంది విద్యార్థులు నమోదు, హాజరు మాత్రం 10 దాటదు. ఉ.వా.ఓ.వా. జిఓ. 25 తేది. 12.08.2021 ననుసరించి అక్కడ ఒక్క ఉపాధ్యాయుడే అవసరం, కానీ ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు అధికారుల అండదండలతో వంతులవారిగా విధులు నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. డిఎస్సి 1996లో ఎస్జిటి గా నియామక తేది: 23.03.1998. ప్రస్తుత పాఠశాలలో తేది: 23.05.2011 నుండి పని జేస్తున్నట్లుగా అధికారిక రికార్డు. అక్కడ అతడి వృత్తి ధర్మాన్ని 'కోడ్ ఆఫ్ కాండక్ట్ నియమనిబంధనల ప్రకారం, చట్టబద్ధంగా ఏ మేరకు నిర్వర్తిస్తున్నట్లు? ఎందరు టీచర్లు? ఎందరు విద్యార్థులు? ప్రభుత్వ పరంగా ప్రత్యేక కమిటీ లేదా నిఘా వర్గాలతో స్థానికంగా సమగ్ర విచారణ జరిపిస్తేనే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. గౌరవ ప్రదమైన విద్యావ్యవస్థ ఉనికిని పరిరక్షించడం సర్వజన సమ్మతమౌతుంది. భవిష్యత్ బాలబాలికలకు మార్గదర్శకంగా నిర్వహించాల్సినవిద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పక్షాన తెలంగాణ ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేసారు.

# బీసీలు ఏకమై తేనే రాజ్యాధికారం

## -బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్

మహబూబ్ నగర్ ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కార్యాలయంలో బీసీ సేన జిల్లా అధ్యక్షులు బాలస్వామి ఆధ్వర్యంలో మహబూబ్ గర్ పార్లమెంటు స్థాయి బీసీ సేన ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ విచ్చేసి ప్రసంగించారు. బీసీలను అన్ని రాజకీయ పార్టీలు కులాలుగా విడదీసి ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయి తప్ప అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి బీసీ జపం చేయడం తప్ప బీసీలకు చట్టసభలలో ప్రాతినిధ్యం కల్పించడం లేదని,సంపద సృష్టిలో ప్రజాస్వామ్య నిర్మాణంలో ముందున్నబీసీల బాగోగులు పట్టించుకోని పార్టీల జెండా మోయాల్సిన అవసరం బీసీలకు లేదని అన్నారు. బి సి సేన నాయకులందరూ గ్రామ స్థాయి నుండి బీసీ చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలలో రాజకీయ చైతన్యం తేవాలని సూచించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలలోమహ బూబ్ నగర్ పార్లమెంటు సీటు బీసీలకు కేటాయించాలని, బీసీలకు సీటు కేటాయించిన పార్టీకి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

# ప్రతిఒక్కరు ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన కలిగిఉండాలి




ఖమ్మం, ఫిబ్రవరి 27(నేటినిజం ప్రతినిధి): ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అధికారులు 2కె వాక్ చేపట్టారు. ఇట్టి 2కె వాక్ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం నుండి మునిసిపల్ కార్పొరేషన్ వరకు కొనసాగింది. ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్బిఐ ఆర్ఎం విజయ్ కుమార్, ఎపిజీవిబి, యుబిఐ చీఫ్ మేనేజర్లు వీరేందర్, బిస్వాస్, జిల్లా ఎస్సి సంక్షేమ అధికారి సత్యనారాయణ, పరిశ్రమల శాఖ జీఎం అజయ్ కుమార్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, అధికారులు తదితరులున్నారు.

# భారతదేశం యొక్క తొలి సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేసే రోబోట్ స్వచ్ భారత్ ప్రచారాన్ని బలోపేతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:భారతదేశపు మొట్టమొదటి సెప్టిక్ ట్యాంక్/మ్యాన్‌హోల్ శుభ్రం చేసే రోబోట్, మానవ పారిశుద్ధ్య పనిని తొలగించడానికి సంపూర్ణ పరిష్కారాన్ని అందిస్తోంది, దేశంలోని వివిధ ప్రాంతాలలో స్వచ్ఛతా అభియాన్‌ను బలోపేతం చేస్తోంది.

ఐ ఐ టీ మద్రాస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీ ఎస్ టి )-టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (టీ బీ ఐ) స్టార్టప్ అభివృద్ధి చేసిన హోమోసెప్ ఆటం అనే సాంకేతికత, మానవ పారిశుద్ధ్య పద్ధతులను పరిష్కరించి, దానిని రోబోటిక్ పారిశుద్ధ్య పద్ధతులకు మారుస్తుంది. ఇది భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లోని 16 నగరాలకు చేరుకుంది మరియు విస్తృతమైన బ్లేడ్ పారిశుధ్యం, ఘన వ్యర్థాలను తొలగించడం, చూషణ మరియు ఒక పరికరంలో నిల్వ ఉంచడం వంటి వాటిని అందిస్తుంది; తద్వారా బహుళ ఆస్తులను సొంతం చేసుకునే ఖర్చు తగ్గుతుంది మరియు మురుగు కాలువల్లో రోబోటిక్ పారిశుద్ధ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

విద్యా/సాంకేతిక/ ఆర్ డ డీ సంస్థలలో నిధి ప్రోగ్రామ్‌లో భాగంగా విజయవంతమైన ఎంటర్‌ప్రైజెస్‌గా వినూత్నమైన స్టార్ట్-అప్‌లకు మద్దతు ఇవ్వడానికి మరియు ప్రోత్సహించడానికి డీ ఎస్ టి-టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్లు (టీ బీ ఐ లు) స్థాపించబడ్డాయి.

సోలినాస్ అనే స్టార్టప్, ఈ సరసమైన రోబోటిక్ పరిష్కారాన్ని అభివృద్ధి చేసింది, ఇది పారిశుద్ధ్య ప్రయోజనాల కోసం పరిమిత స్థలాన్ని తనిఖీ చేయడానికి, శుభ్రం చేయడానికి మరియు నిర్వహించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ)ని సమీకృతం చేసింది. ఇది మధురైలో మ్యాన్‌హోల్ అడ్డంకులు మరియు మురుగునీరు పొంగిపోర్లటాన్ని తగ్గించడంలో సహాయపడింది. హోమోసెప్ ఆటం యొక్క అప్లికేషన్ చెన్నై లోని జనసాంద్రత గల ప్రాంతాలలోని క్లిష్టమైన ఇరుకు సందులకు విస్తరించబడింది. ఇది పెద్ద అపార్ట్‌మెంట్‌లు, హౌసింగ్ బోర్డులు మరియు వ్యక్తిగత గృహాలకు సంబంధించిన సెప్టిక్ ట్యాంక్‌లను లక్ష్యంగా చేసుకుంది. ఈ ప్రక్రియ మునిసిపాలిటీలను వేగంగా మరియు సమర్థవంతంగా శుభ్రపరచడానికి, తొలగించడానికి మరియు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లకు వ్యర్థాలను రవాణా చేయడానికి వీలు కల్పించింది. అంతేకాకుండా, రోబోట్‌లతో మ్యాన్‌హోల్ శుభ్రం చేయడం ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు సాధికారత కల్పించారు, ఇవి మ్యాన్‌హోల్‌లను బయటి నుండి శుభ్రం చేయడానికి మరియు విషపూరిత వాతావరణంలోకి వెళ్లకుండా ఉండటానికి సహాయపడతాయి, తద్వారా పారిశుద్ధ్య కార్మికులకు గౌరవాన్ని అందిస్తుంది.

సోలినాస్ అనేది ఐ ఐ టీ మద్రాస్ నుండి స్థాపించబడ్డ డీప్-టెక్ మరియు క్లైమేట్ టెక్ స్టార్టప్, ఇది నీరు మరియు పారిశుద్ధ్య రంగంలో విప్లవాత్మక మార్పులు మరియు వాతావరణ పరిస్థితులను మెరుగుపరచడం లోని సవాళ్లను పరిష్కరించే ఉద్దేశ్యంతో స్థాపించబడింది. ఐ ఐ టీ మద్రాస్ డీ ఎస్ టి-టీ బీ ఐ కూడా ప్రారంభ దశలో సోలినాస్ ఉత్పత్తి అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించింది.

భారతదేశపు తొలి 90 ఎం ఎం నీటి రోబోట్ మరియు 120 ఎం ఎం మురుగు రోబోట్‌లతో సహా సూక్ష్మ రోబోట్‌లను అభివృద్ధి చేయడంలో ఈ స్టార్టప్ ప్రత్యేకత కలిగి ఉంది, నీటి-మురుగు పైపులైన్‌లలోని కలుషిత సవాళ్లను పరిష్కరించడానికి 100 ఎం ఎం కంటే తక్కువ పైపులైన్‌ల ద్వారా వెళ్ళగల సామర్థ్యం ఉంది. డీ ఎస్ టి నుండి వచ్చిన మద్దతు ద్వారా సుస్థిరమైన మరియు భారీ గా ఎదిగే అవకాశం గల పరిష్కారాలు రెండింటినీ నిర్ధారిస్తుంది.

ఈ తొలి ఉత్పత్తితో పాటు, సోలినాస్ యొక్క సాంకేతికతలు నీటి వృధాలు, భూగర్భజలాల కాలుష్యం, వాతావరణ మార్పు మరియు మానవ పారిశుద్ధ్య పనిని, కలుషిత నీటిని తాగడం, మురుగునీరు పొంగిపొంర్లడం వంటి రోజువారీ మానవ సవాళ్ల వంటి కొన్ని వాతావరణ సవాళ్లను పరిష్కరించాయి.

ఎండోబోట్ మరియు స్వాస్త్ ఏ ఐ వంటి సాంకేతికతలు కోయంబత్తూర్ వంటి నగరాల్లో వృధాలు, అడ్డంకులు మరియు చెట్ల మూలాలు వంటి భూగర్భ సమస్యల కారణంగా తరచుగా గుర్తించబడని నీటి కాలుష్యం, వృధాలు మరియు మురుగు పొంగిపొర్లడాన్ని గుర్తించి, తగ్గించగల పైప్‌లైన్ డయాగ్నస్టిక్ సాధనాలుగా పనిచేశాయి.

సోలినాస్ యొక్క ఏఐ-ఆధారిత పైప్‌లైన్ లోపం గుర్తింపు మరియు అంచనా సేవలు ఖర్చులను ఆదా చేయడం, పరిష్కార సమయాన్ని తగ్గించడం మరియు 1000 కంటే ఎక్కువ గృహాలకు తాగునీటి సరఫరాను అందించిన హుబ్బలి నగరానికి తాగునీటి సరఫరాను మొత్తం గా మెరుగుపరచడంలో సహాయపడింది. సీవరేజ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ గోవా కోసం మురుగునీటి పైప్‌లైన్‌లో లోపాలను గుర్తించడం, త్వరితంగా మరియు మరింత తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారాలకు దారితీసింది. చెన్నై మెట్రోతో భాగస్వామ్యంతో ఇది పరస్పర-కాలుష్యం మరియు అక్రమ ట్యాపింగ్‌ల యొక్క కీలక సవాళ్లను గుర్తించడంలో సహాయపడింది, తద్వారా పైప్‌లైన్ సమగ్రత అలాగే నీటి ప్రాప్యతను మెరుగుపరిచింది.

"అటువంటి స్టార్టప్‌లకు డీ ఎస్ టి యొక్క మద్దతు విజ్ఞాన ఆధారిత సంస్థలను అభివృద్ధి చేయడానికి మరియు సామాజిక సవాళ్లను పరిష్కరించడానికి అలాగే దేశ వృద్ధి మరియు అభివృద్ధికి దోహదపడటానికి ప్రభుత్వ స్టార్టప్ ఉద్యమం నుండి ప్రేరణ పొందిన యువకులకు ప్రోత్సాహానికి ప్రధాన మూలం" అని ప్రొఫెసర్ అభయ్ కరాండీకర్, కార్యదర్శి డిఎస్‌టి తెలిపారు.

# పతంజలి ఉత్పత్తులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : పతంజలి ఉత్పత్తులకు సంబంధించి తప్పుదోవ పట్టించే ప్రకటనలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు మంగళవారం నాడు ప్రశ్నించింది. పతంజలి ఉత్పత్తులకు సంబంధించిన తప్పుడు ప్రచారం ఇప్పికే అందరికీ చేరింది. ఇది దురదృష్టకరం, పతంజలి ఉత్పత్తులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం కోరింది. ఇంత జరుగుతోన్న కేంద్ర ప్రభుత్వం కళ్లు మూసుకొని కూర్చొని ఉందని తీవ్రస్థాయిలో మండిపడింది. పతంజలి సంస్థ కో ఓనర్ యోగా గురువు రామ్ దేవ్ బాబా అనే సంగతి తెలిసిందే.పతంజలి మందులకు సంబంధించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు గత ఏడాది నవంబర్‌లో జారీచేసింది. రామ్ దేవ్ బాబాకు ఏమయ్యింది. మేం అతనిని గౌరవిస్తాం. యోగా చేసి మంచి పేరు సంపాదించారు. యోగా విషయంలో అందరం ఆయన మాట వింటాం. ఇతర వ్యవస్థలను ఆయన కించపరచొద్దు. పతంజలి ప్రకటన ప్రకారం దేశంలోని వైద్యులు అందరూ హంతకులా..? మరొకటా అని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించి పరిష్కారం కనుగొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

# పీ ఎం గతిశక్తి పోర్టల్‌ని ఉపయోగించి నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ ఐ సీ డీ సీ) డిపార్ట్‌మెంట్ ఫర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీ ఉ ఇంటర్నల్ ట్రేడ్ (డీ పీ ఐ ఐ టీ), వాణిజ్య ఉ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం మరియు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఢిల్లీలో ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ (ఎఫ్ ఐ ఐ టీ- పీ ఎం గతిశక్తి సూత్రాలు మరియు ఫ్రేమ్‌వర్క్‌ను ప్రభావితం చేస్తూ భారతదేశంలో గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి ప్రాంత అనుకూలతను అంచనా వేసే లక్ష్యంతో ఐ ఐ టీ డీ 2024 ఫిబ్రవరి 26న న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో అవగాహన ఒప్పందం (ఎం ఓ యూ)పై సంతకం చేసింది.

పరిశ్రమల ప్రోత్సాహం మరియు అంతర్గత వాణిజ్య విభాగం (డీ పీ ఐ ఐ టీ) కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్ నేతృత్వంలో, భారతదేశ పారిశ్రామిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అధునాతన సాంకేతికత మరియు పరిశోధనలను ఉపయోగించడంలో ఈ సహకారం ఒక ముఖ్యమైన చర్యగా గుర్తించబడింది. ఇది రెండు సంస్థలు వారి సంబంధిత రంగాలలో పరస్పర ప్రయోజనాన్ని పెంచుకోవడంలో సహాయపడుతుంది. ఎంఓయూ సంతకం కార్యక్రమంలో కల్నల్ నవీన్ గోపాల్, సీ ఓ ఓ (ఎఫ్ ఐ ఐ టీ, ఐ ఐ టీ ఢిల్లీ), ప్రొఫెసర్ నోమేష్ బోలియా, ప్రొఫెసర్ సంజీవ్ దేశ్‌ముఖ్, శ్రీ దీపక్ గౌతమ్, శ్రీ ప్రతీక్ బద్గుజార్ మరియు ఎన్ ఐ సీ డీ సీ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎన్ ఐ సీ డీ సీ యొక్క సీ ఈ ఓ మరియు ఎం డీ శ్రీ రజత్ కుమార్ సైనీ, ఐ ఎ ఎస్ మాట్లాడుతూ, భాగస్వామ్యం యొక్క పరివర్తన సంభావ్యత గురించి ఆశావాదాన్ని వ్యక్తం చేశారు. "అధునాతన సాంకేతికతలు మరియు పరిశోధన నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడం ద్వారా, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన ప్రదేశాలను గుర్తించడం, తద్వారా పెట్టుబడులను ఆకర్షించడం, స్థానిక వాణిజ్యాన్ని ప్రోత్సహించడం మరియు ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నాము" అని శ్రీ సైనీ అన్నారు.

పీ ఎం గతిశక్తి, నేషనల్ మాస్టర్ ప్లాన్ పోర్టల్ యొక్క ప్రాదేశిక ఉ విశ్లేషణాత్మక డేటా సాధనాలను ఉపయోగించడం ద్వారా భారతదేశం అంతటా గ్రీన్‌ఫీల్డ్ పారిశ్రామిక స్మార్ట్ నగరాలను అభివృద్ధి చేయడానికి సరైన స్థానాలను అంచనా వేయడానికి ఎన్ ఐ సీ డీ సీ మరియు ఎఫ్ ఐ ఐ టీ-ఐ ఐ టీ డీ సహకరిస్తాయి. ఈ చొరవ ప్రపంచ తయారీ వేదిక గా ఉద్భవించాలనే భారతదేశ దృష్టికి అనుగుణంగా ఉంటుంది, అలాగే సుస్థిరమైన భవిష్యత్ పట్టణ ప్రణాళిక మరియు అభివృద్ధిలో సమాచార-ఆధారిత నిర్ణయాల యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

వ్యాపార సౌలభ్యం, జీవన వ్యయాలు, రవాణా ఖర్చులు, బహుళ-మోడల్ అనుసంధానం, జీవన సౌలభ్యం, జీవన వ్యయాలు, నిర్దిష్ట సంభావ్యతతో సహా ప్రాంత అనుకూలతని ప్రభావితం చేసే వివిధ అంశాలను విశ్లేషించడానికి. పరిశ్రమ(లు), ముడి పదార్థాల లభ్యత మరియు సుస్థిరత్వం ఎఫ్ ఐ ఐ టీ-ఐ ఐ టీ డీ దాని సాంకేతిక నైపుణ్యం మరియు పరిశోధన సామర్థ్యాలను ఎం ఓ యూ ప్రభావితం చేస్తుంది. ఈ సహకారం ఫలితంగా రూపొందించబడిన సమగ్ర నివేదిక భవిష్యత్ పట్టణ ప్రణాళిక నిర్ణయాలకు మార్గదర్శక నమూనాగా ఉపయోగపడుతుంది, పరిశ్రమ మరియు సమాజం యొక్క అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా గ్రీన్‌ఫీల్డ్ నగరాల అభివృద్ధిని సులభతరం చేస్తుంది.

భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నందున, బలమైన మరియు శాశ్వత భవిష్యత్తును నిర్మించడంలో సాంకేతికత, పరిశోధన మరియు కలిసి పనిచేయడం ఎంత ముఖ్యమో ఇలాంటి ప్రయత్నాలు తెలియజేస్తున్నాయి. "వికసిత్ భారత్" (అభివృద్ధి చెందిన భారతదేశం) లక్ష్యాన్ని సాధించడానికి ఇది చాలా కీలకం.

# సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ శ్రీలంకకు చెందిన ప్రభుత్వ అధికారులకు ఎన్‌సిజిజి ముస్సోరీలో నేడు ప్రారంభమైన 2వ సామర్థ్య నిర్మాణ కార్యక్రమం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌సిజిజి - సుపరిపాలన జాతీయ కేంద్రం) శ్రీలంక సీనియర్ సివిల్ సర్వెంట్ల (ప్రభుత్వాధికారులు) కోసం 2 సామర్థ్య నిర్మాణ కార్యక్రమం నేడు ముస్సోరీలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని 26 ఫిబ్రవరి 2024 నుంచి 8 మార్చి 2024వరకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, మునిసిపల్ కార్యదర్శులు, డివిజనల్ కార్యదర్శులు, అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శులు, డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ ల్యాండ్ కమిషనర్, ప్రాంతీయ డైరెక్టర్లు, అసిస్టెంట్ చీఫ్ సెక్రెటరీ, ప్రాంతీయ స్పోర్ట్స్ డైరెక్టర్ సహా శ్రీలంకలో వివిధ హోదాలలో పని చేస్తున్న 40మంది సీనియర్ సివిల్ సర్వెంట్లు హాజరయ్యారు. శ్రీలంక సీనియర్ సివిల్ సర్వెంట్ల మొదటి బృందం 12-17 ఫిబ్రవరి, 2024 మధ్య కాలంలో ఎన్‌సిజిజిని సందర్శించింది. ప్రధాన మంత్రి కార్యదర్శి శ్రీ అనురా దిస్సనాయక 14మంది సభ్యులతో కూడిన ఈ బృందానికి నేతృత్వం వహించారు. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోని పాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం కింద పని చేసే ఎన్‌సిజిజి స్వయంప్రతిపత్తి గల సంస్థ. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రభుత్వ విధానంలో సామర్థ్య నిర్మాణం, క్రియాశీలక పరిశోధనకు కట్టుబడి ఉంటుంది.

సుపరిపాలనా జాతీయ కేంద్రం (ఎన్‌సిజిజి) డైరెక్టర్ జనరల్ , పాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదులు (డిఏఆర్‌పిజి) కార్యదర్శి శ్రీ వి. శ్రీనివాస్ ఎన్‌సిజిజి కార్యనిర్వాహక చట్రంను మాత్రమే కాక, కేంద్రం ఏర్పడినప్పటి నుంచి అది సాధించిన చెప్పుకోదగ్గ పురోగతిని పరిచయం చేశారు. గరిష్ట పాలన - కనీస ప్రభుత్వం అన్న విధాన సూత్రం కింద ప్రభుత్వాన్ని- పౌరులను సన్నిహితం చేసేందుకు డిజిటల్ సాంకేతికతను స్వీకరించడంలోనే గొప్ప విజయాన్ని పట్టి చూపుతూ, పరిపాలనలో నూతన రూపావళిలో లోతైన అంతర్దృష్టులను ఆయన తన ఉపన్యాసంలో అందించారు. సిపిజిఆర్ఎఎంఎస్ ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి చెప్పుకోదగిన విజయాలను పట్టి చూపుతూ, దీనివల్ల ప్రజలకు చేకూరే లబ్ధిని నొక్కి చెప్పారు. అంతేకాకుండా, ఇ- ఉన్నత్, నివేష్ మిత్రా, సేవా సింధు సహా కీలకమైన ఇ-గవర్నెన్స్ చట్రాలను ఉదహరిస్తూ సమగ్రమైన పాలన కోసం డిజిటల్ పరిష్కారాలను ఉపయోగించుకోవాలన్న భారత్ నిబద్ధతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమ ప్రాథమిక లక్ష్యం భారతదేశంలో పాలన, ప్రజా సేవల బట్వాడాను మెరుగుపరిచేందుకు అమలు చేసిన విజ్ఞానం, ఆవిష్కరణల మార్పిడిని సులభతరం చేయడం. శ్రీలంకలో కూడా భారత్‌ను అనుకరించి ఇ -గవర్నెన్స్ నమూనాలను విజయవంతంగా అన్వేషించి, అమలు చేసేందుకు పాల్గొన్నవారిని ప్రోత్సహిస్తూ, దానివల్ల గల సంభావ్య పరివర్తనాత్మక ప్రభాన్ని నొక్కి చెప్పారు.

ఈ కోర్సు గురించి స్థూలదృష్టిని ఇస్తూ, ఎన్‌సిజిజి దేశంలో చేపట్టిన భూసేకరణ, పాలన రూపావళిని మార్చడం, అందరికీ గృహాలు, డిజిటల్ సాంకేతికతను ఉపయోగించుకోవడం, తీర ప్రాంతాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ విపత్తు నిర్వహణ, పిఎం జన్ ఆరోగ్య యోజన, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలు, స్వామిత్వ పథకం, జిఇఎం: పాలనలో పారదర్శకతను తేవడం, ఆధార్ తయారీ : సుపరిపాలనకు ఒక మంచి పరికరం, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయం, వర్తుల ఆర్థిక వ్యవస్థ, ఎన్నికల నిర్వహణ సహా దేశంలో చేపట్టిన అనేక చొరవలను ఎన్‌సిజిజి పంచుకుంటోందని అసోసియేట్ ప్రొఫెసర్, కోర్స్ కోఆర్డినేటర్ డా. ఎపి సింగ్ చెప్పారు. అభ్యాస అనుభవాన్ని మరింత సుసంపన్నం చేసేందుకు, పాలన, సమాజ గతిశీలితలోకి ఆచరణాత్మక అంతర్దృష్టులను అందించేందుకు క్షేత్ర పర్యటనలుగా ఇందిరాగాంధీ ఫారెస్ట్ నేషనల్ అకాడెమీ, మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగ, తాజ్ మహల్ వంటి ప్రముఖ సంస్థలకు వారిని తీసుకువెళ్లారు.

విదేశాంగ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో ఎన్‌సిజిజి బాంగ్లాదేశ్, కెన్యా, టాంజానియా, టునీసియా, సిషెల్స్, గాంబియా, మాల్దీవులు, శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్, లావోస్, వియత్నాం, నేపాల్, భూటాన్, మయన్మార్, ఇథియోపియా, ఎరిట్రియా, కంబోడియా సహా 17 దేశాలకు చెందిన సివిల్ సర్వెంట్లకు శిక్షణను ఇచ్చింది. సామర్థ్య నిర్మాణ కార్యక్రమాన్ని కోర్స్ కోఆర్డినేటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎపి.సింగ్, అసోసియేట్ కోర్స్ కోఆర్డినేటర్ డా. ముకేష్ భండారీ, ఎన్‌సిజిజి బృందం పర్యవేక్షించనున్నారు.

# హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటే : హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 27: హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారింది అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారంలోకి రాగానే, ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని, ఉచితంగా క్రమబద్దీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు మాట తప్పిందని పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ పేరిట ఫీజు వసూలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందన్నారు.

నో ఎల్ఆర్ఎస్ .. నో బీఆర్ఎస్ అంటూ గతంలో ప్రజలను రెచ్చగొట్టి ఇప్పుడు ఎల్ఆర్ఎస్‌కు ఫీజులు వసూలు చేస్తామనడం కాంగ్రెస్ నేతల మోసపూరిత మాటలకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలి. లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నా అని హరీశ్‌రావు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# మెరుగైన భారత్ ఆవిష్కరణ దిశగా అడుగులు : నిర్మలా సీతారామన్




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:రాబోయే తరానికి మెరుగైన భారత్‌ను అందించడమే నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ బాధ్యతని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 2047 నాటికి డిజిటల్ మౌలిక సదుపాయాలు సహా తదుపరి తరం సంస్కరణల అమలును లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. 2014 నుంచి పలు వ్యవస్థాగత సంస్కరణలను చేపట్టామని తెలిపారు.వికసిత్ భారత్ 2047 పేరిట ఫిక్కీ నిర్వహించిన సదస్సును ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం సంస్కరణలను ముందుకు తీసుకువెళుతుందని స్పష్టం చేశారు. భారత్‌ను వికసిత్ భారత్‌గా ఆవిష్కరించే క్రమంలో ప్రభుత్వానికి పరిశ్రమల నుంచి తోడ్పాటు అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్ తరానికి మెరుగైన భారత్‌ను అందించేలా తమ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని చెప్పారు.

రాబోయే రోజుల్లో యువత ఇక్కడే ఉంటూ ఉపాధి పొందేలా స్వయం సమృద్ధి సాధిస్తామని, దేశాన్ని ప్రేమించినా బతుకుతెరువు కోసం విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ముమ్ముందు తలెత్తదని అన్నారు. అభివృద్ధి లక్ష్యాలను చేరుకునే క్రమంలో మెరుగైన డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం నెలకొందని మంత్రి వివరించారు.

# ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ

## -రైతులకు ఇచ్చిన ప్లాట్స్‌ను రద్దు చేస్తూ ఇచ్చిన నోటీసులను కొట్టేసిన హైకోర్ట్ ధర్మాసనం

అమరావతి, ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. భూసేకరణ ప్రక్రియలో సేకరించిన భూముల్లో ఇచ్చిన ప్లాట్స్‌ను రద్దు చేస్తూ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను ధర్మాసనం కొట్టివేసింది. రైతులకు ఇచ్చిన ప్లాట్స్‌ను రద్దు చేస్తూ ఇచ్చిన నోటీసులను కూడా హైకోర్ట్ ధర్మాసనం కొట్టేసింది. కమిషనర్, డిప్యూటీ తహశీల్దార్ ఇచ్చిన నోటీస్‌లు చెల్లవని న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్లాట్లను రద్దు చేస్తూ తమకు ఇచ్చిన నోటీసులను హైకోర్ట్‌లో రైతులు సవాల్ చేశారు. ఈరోజు విచారణకు రాగా... రైతుల తరపున న్యాయవాదులు కారుమంచి ఇంద్రనీల్ బాబు, ఆదినారాయణ రావు వాదనలు వినిపించారు. వీరి వాదనలను ధర్మాసనం పరిగణలోకి తీసుకుంది. మొత్తం 862 ప్లాట్లు రద్దు చేస్తూ సీఆర్‌డీఏ నోటీస్‌లు జారీ చేసింది. ఈ నిర్ణయం సీఆర్‌డీఏ చట్టం, మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమని న్యాయవాదులు వాదనలు వినిపించారు. చట్టంలో మార్పులు తెచ్చామని ప్రభుత్వం చెప్పింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం రద్దు నిర్ణయాన్ని హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది.

# విచక్షణాధికారం మేరకే ఎమ్మెల్యేలపై వేటు : ఏపీ స్పీకర్ తమ్మినేని

అమరావతి, ఫిబ్రవరి 27:ఏపీలో పార్టీ ఫిరాయించిన 8 మంది ఎమ్మెల్యేలపై వేటు వేసిన ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం మరోసారి స్పందించారు. తనకున్న విచక్షణాధికారం మేరకు వేటు నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఫిరాయింపులకు స్థానం లేదని పేర్కొన్నారు. ఎవరైనా పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే వేటు తప్పదని అన్నారు.వైసీపీ, టీడీపీకిచెందిన 8 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని వారికి సమయం ఇచ్చినా విచారణకు హాజరుకాలేదని వెల్లడించారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు న్యాయస్థానాలకు వెళ్లినా కూడా తాను తీసుకున్న నిర్ణయం ఫైనలని తేల్చి చెప్పారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికై పార్టీ ఫిరాయించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (నెల్లూరు రూరల్ నియోజకవర్గం), ఉండవల్లి శ్రీదేవి (తాడికొండ), మేకపాటి చంద్రశేఖరరెడ్డి (ఉదయగిరి), ఆనం రామనారాయణరెడ్డి (వెంకటగిరి) టీడీపీలో చేరారు.టీడీపీ నుంచి శాసన సభకు ఎన్నికై పార్టీకి దూరంగా ఉంటున్న వాసుపల్లి కరణం బలరాం (చీరాల), గణేష్‌కుమార్ (విశాఖ దక్షిణ), వల్లభనేని వంశి (గన్నవరం), మద్దాల గిరి (గుంటూరు వెస్ట్) వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా వైసీపీ, టీడీపీకి చెందిన నాయకులు వారిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంతో ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ సోమవారం రాత్రి స్పీకర్ ఆదేశాల మేరకు ఏపీ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు.




# కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, ఫిబ్రవరి 27: పేద, మధ్య తరగతి ప్రజలకు చేయూతను అందించాలనే సదుద్దేశంతో మాజీ నాటి సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించారని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 37 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అర్హులైన పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకాలతో పేదింటి ఆడబిడ్డల పెండ్లికి కొండంత అండగా నిలిచినట్లుయిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, అరుణ శ్రీనివాస్‌గౌడ్, ఆకుల రూప తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కుటుంబ పార్టీలు ఎక్కువయ్యాయి: ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఎన్నికల కోసం సన్నాహం.. కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో శ్రీకారం చుట్టామని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి అన్నారు. దేశ వ్యాప్తంగా ఎన్నికల సన్నహాల నేపథ్యంలో భారత్ రైజింగ్ అలైట్ మీట్ పేరుతో బీజేపీ సమావేశాలు నిర్వహిస్తోంది. జిల్లాలో జరిగిన సమావేశంలో పురందేశ్వరి మాట్లాడుతూ.. బీజేపీ రాజకీయ పార్టీ ఇతర రాజకీయ పార్టీల కన్నా భిన్నమన్నారు. అధికారాన్ని సేవ భావం కోసం వినియోగిస్తున్నామన్నారు. వికసిత్ భారత్ 2040 ఆవిష్కరించాలని చూస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో కుటుంబ పార్టీలు ఎక్కువయ్యాయని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రైవేటు పరం చేయడం కన్నా దాన్ని ఏ విధంగా లాభాల్లో తీసుకురావాలో ప్రయత్నం చేస్తున్నామన్నారు. రైల్వే జోన్‌కు భూమి కేటాయించకుండా కేంద్ర అధినాయకత్వంపై నిందలు వెయ్యడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏపీని అగ్రగామిగా నిలబెట్టేందుకు బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ప్రజల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో కూడా బీజేపీని ఆశీర్వదిస్తే మంచి నిర్ణయాలు వస్తాయన్నారు.

# ప్రజలు బీఆర్ఎస్‌ను వద్దనుకోలేదు.. బలమైన ప్రతిపక్షంగా దీవించారు : దేశపతి



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 27:(నేటినిజం ప్రతినిధి): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కూడా పటిష్టంగా ఉండాలి. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను అంచనా వేసుకొని ముందుకు వెళ్దామని, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు.

మంగళవారం వేముల వాడ నియోజకవర్గస్థాయి కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో బోయిన పల్లి వినోద్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు.అనంతరం దేశపతి మాట్లాడుతూ..ప్రజలు బీఆర్ఎస్‌ను వద్దనుకోలేదు. 39 సీట్లతో చరిత్రలో ఇంత పెద్ద బలమైన ప్రతిపక్షం ఎప్పుడు కూడా లేదన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని సజీవంగా ఉంచి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో..మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. బండి సంజయ్ గెలుపొంది వేములవాడ నియోజకవర్గానికి ఏమీ ఒరగబెట్టేది లేదన్నారు. ప్రతి కార్యకర్త వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి వినోద్ కుమార్‌ను గెలిపించుకుందామన్నారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి అండగా నిలుస్తానని హామీనిచ్చారు.

# ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన ఆర్.ఎం.పి, పి.ఎం.పీలు




హైదరాబాద్ ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాష్ట్ర ఆర్ఎంపి పి.ఎం.పి డాక్టర్ల సంఘం ఆదవరంలో ప్రతినిధుల బృందం ప్రొఫెసర్ కోదండరాం ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్.ఎం.పి పి.ఎం.పి డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు.

ఉమ్మడి రాష్ట్రంలో డాక్టర్ వైయస్సార్ జీవో ఎంఎస్ నెం. 429 జారీ చేసి ఆర్.ఎం.పి, పి.ఎం.పి లకు పారామెడికల్ సర్వీసెస్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రైనింగ్ కాలం పూర్తి కాకముందే డాక్టర్ వైయస్సార్ హఠాన్మరణం చెందారు. ఆయన తదనంతరం వచ్చిన ముఖ్యమంత్రులు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంతో మధ్యంతరంగా పారామెడికల్ సర్వీసెస్ ట్రైనింగ్ కార్ కార్యక్రమం ఆగిపోయింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తూతూ మంత్రంగా జీవో ఎంఎస్ నెం: 428 జారీ చేసి నిధులు కేటాయించలేదు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ఆర్.ఎం.పి, పి.ఎం.పీ ల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఎలక్షన్ మేనిఫెస్టోలో పొందపరిచిన విధంగా పారామెంటరీ సర్వీసెస్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి ఆర్.ఎం.పి, పి.ఎం.పి లను ఆదుకోవాలని వినతి పత్రం ద్వారా తెలియజేశారు.

ఈ సందర్భంగా కోదండరాం సానుకూలంగా స్పందించారు, గ్రామీణ ప్రాంతాలలో నామ మాత్రపు ఫీజు తీసుకొని ఆర్ఎంపీలు పీఎంపీలు చేసే సేవలు అభినందనీయమని అన్నారు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.పి, పీ.ఎం.పి మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యానిర్వహణ అధ్యక్షుడు పబ్బా చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగభూషణం, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు పి మల్లేశం, పల్లెపాటి శ్రీనివాస్, ఘట్కేసర్ మండలం అధ్యక్షుడు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

## - ఎమ్మెల్యే అశోక్ బాబు

అమరావతి, ఫిబ్రవరి 27: గ్రామాల్లో స్నేహపూర్వకమైన వాతావరణ ఏర్పడాలంటే అది ఒక్క దైవ కార్యక్రమాలతోనే సాధ్యపడుతుందని ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన ఉంటే మానసికంగా ఎంతో ప్రశాంతత లభిస్తుందని ఇచ్చాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ బాబు తెలిపారు.

మంగళవారం గొల్లవూరు సచివాలయం తురక శాసనం పంచాయతీ పరిధిలో పాత జాతీయ రహదారి నుండి త్వరగా శాసనం గ్రామదేవత శ్రీశ్రీశ్రీ ముక్కెర పోలమ్మ అమ్మవారి గుడికి సిసి రోడ్ల నిర్మాణానికి ఎంపీ నిధులు ఐదు లక్షల రూపాయలతో ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ బాబు స్థానిక తెదేపా నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. పల్లె వాతావరణం ప్రశాంతంగా ఉండాలంటే ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే విరాజిల్లుతుందన్నారు.

# ఏపీలో క్యాస్ట్ వార్ కాదు.. క్లాస్ వార్ జరగాలి : ఏపీ సీఎం జగన్



అమరావతి, ఫిబ్రవరి 27: ఆంధ్రప్రదేశ్‌లో మరో 45 రోజుల్లో జరుగనున్న ఎన్నికల్లో కుల పోరాటం కాదని, పేదవాడికి మేలు జరిగే విధంగా ఎన్నికలు జరుగాలని ఏపీ సీఎం వైఎస్ జగన్ వైసీపీ అభ్యర్థులకు, నాయకులకు పిలుపునిచ్చారు. మంగళగిరిలో మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో సుదీర్ఘంగా మాట్లాడారు. రాజకీయాల్లో విశ్వసనీయత ఎంతో ముఖ్యమని, ఆ విశ్వసనీయత వైసీపీకి ఉందని పేర్కొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. సాధ్యం కానీ హామీలను చంద్రబాబు మేనిఫెస్టోలో పెట్టారని విమర్శించారు. వైసీపీ తరుపున పోటీ చేసే అభ్యర్థుల మార్పు 99 శాతం పూర్తయిందని, ఇప్పటికే నిర్ణయించిన మీదట వారే అభ్యర్థులని స్పష్టం చేశారు. ఒకటి, రెండు చోట్ల మాత్రమే మార్పులు ఉంటాయని అన్నారు.

45 రోజుల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త ఐదుసార్లు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, వాటి వల్ల ఇంటి యజమానికి కలిగిన లాభాలను వివరించాలని సూచించారు. పేదవాడు బాగుపడాలంటే వైసీపీ రావాలనే విషయాన్ని స్పష్టంగా చెప్పాలని కోరారు. ఏపీలో 175 స్థానాలకు175 స్థానాలు. 25 ఎంపీ స్థానాలకు 25 స్థానాలు వైసీపీ అభ్యర్థులే గెలవాలని ఆ దిశగా అడుగువేయాలని పిలుపునిచ్చారు.

# మొదటి పే జల్ సర్వేక్షన్ అవార్డులను మార్చి 5న ప్రదానం చేయనున్న రాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మొదటి పే జల్ సర్వే అవార్డుల ప్రదానోత్సవం 5 మార్చి 2024 న విజ్ఞాన్ భవన్‌లో జరుగుతుంది. భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము అవార్డుల ప్రదానోత్సంానికి అధ్యక్షత వహిస్తారు. జల సంరక్షణ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నగరాలు, రాష్ట్రాలకు అవార్డులు అందజేస్తారు.

జల సంరక్షణ రంగంలో నగరాలు, రాష్ట్రాలు కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా 130 అవార్డులు ప్రదానం చేస్తారు. ఈ అవార్డులు ప్రతిష్టాత్మకమైన పే జల్ గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ సిటీ అవార్డులతో సహా వివిధ తరగతుల్లో అవార్డులు అందజేస్తారు.జనాభా కేటగిరీలలో (1 నుండి 10 లక్షలు , 10 నుంచి 40 లక్షలు మరియు 40 లక్షలు ) అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన రాష్ట్రాలు/నగరాలకు పే జల్ గోల్డ్ (1 వ ) అందజేస్తారు.ఈ తరగతిలో 2వ స్థానంలో నిలిచిన నగరాలు/రాష్ట్రాలకు పే జల్ సిల్వర్, 3వ సాధించిన రాష్ట్రాలు/నగరాలకు పే జల్ బ్రాంజ్ అవార్డు అందిస్తారు. అవార్డులలో బెస్ట్ వాటర్ బాడీ, సస్టైనబిలిటీ ఛాంపియన్, రీయూజ్ ఛాంపియన్, వాటర్ క్వాలిటీ, సిటీ సాచ్యురేషన్, ప్రతిష్టాత్మకమైన అమృత్ 2.0 రొటేటింగ్ ట్రోఫీ ఆఫ్ ది ఇయర్ అవార్డులు ఉన్నాయి 485 నగరాల్లో అమృత్ 2.0 కింద వివిధ ప్రమాణాలు పరిశీలించిన తర్వాత అవార్డు గ్రహీతలను ఎంపిక చేశారు. అందుబాటు, పరిధి, ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, గృహాలలో నీటి నాణ్యత, రిజర్వాయర్‌ల సంరక్షణ,ఎస్పీఏడిఏ, / ఫ్లోమీటర్‌ల లభ్యత, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగానికి సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. నగరాలకు 5 స్టార్ గ్రేడ్ నుంచి నో స్టార్ ర్యాంకింగ్ ఇచ్చారు. ముఖ్యమైన ప్రమాణాలపై పనితీరు ఆధారంగా గ్రేడింగ్ ఇస్తారు.ప్రజల అవసరాల మేరకు పరిశుభ్రమైన నీరు సరఫరా చేసిన నగరాలను గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గుర్తించి గౌరవిస్తుంది.

కార్యక్రమంలో 1500 మందికి పైగా అవార్డు గ్రహీతలు, ప్రతినిధులు పాల్గొంటారు. కార్యక్రమంలో అవార్డులను అందించడంతో పాటు అమృత్ మిత్ర కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న మహిళా స్వయం సహాయక బృందాలను అమృత్ మిత్ర కార్యక్రమం ద్వారా అనుసంధానం చేస్తారు. అమృత్ 2.0 కింద 2023 నవంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించిన " విమెన్ ఫర్ వాటర్ , వాటర్ ఫర్ విమెన్ " కార్యక్రమం స్ఫూర్తితో అమృత్ మిత్ర కార్యక్రమానికి రూపకల్పన జరిగింది. పట్టణ నీటి సరఫరా రంగంలో మహిళా స్వయం సహాయక బృందాలకు ప్రాధాన్యత కల్పించి, గృహాల్లో నీటి వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించి తగిన పాత్ర కల్పించడం ప్రధాన లక్ష్యంగా అమృత్ మిత్ర కార్యక్రమం అమలు జరుగుతుంది. బిల్లులు , సేకరణ , నీటి వృథాను గుర్తించడం, , ప్లంబింగ్ పనులు , నీటి నాణ్యత నమూనాల సేకరణ, మౌలిక సదుపాయాల నిర్వహణ వంటి కార్యక్రమాల అమలులో అమృత్ మిత్ర సభ్యులు కీలక పాత్ర పోషిస్తారు. మహిళల్లో యాజమాన్య భావనను కలిగించడం , సాంప్రదాయకంగా పురుష - ఆధిపత్య రంగాల్లో సమగ్రతను, వైవిధ్యాన్ని ప్రోత్సహించడం , అదే సమయంలో కుటుంబాలకు సురక్షితమైన తాగునీటిని అందించడం, లింగ అసమానతలు పరిష్కరించడం, లక్ష్య సాధన ద్వారా మహిళా స్వయం సహకార బృందాల సామాజిక - ఆర్థిక స్థితిని మెరుగుపరచడం కోసం కార్యక్రమాలు అమలు జరుగుతాయి. అమృత్ 2.0 లక్ష్యాల సాధన, అవగాహన పెంపుదల, సమాజంపై సానుకూల ప్రభావం, భవిష్యత్ కార్యక్రమాల అమలులో మహిళా స్వయం సహాయక బృందాలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తారు.

జల వనరుల లభ్యత, సరఫరా వద్ద ఎన్ఏబిఎల్ ల్యాబ్ పరీక్షల ద్వారా ప్రజలకు సురక్షిత మంచినీరు సరఫరా చేయడానికి పే జల్ సర్వేక్షన్ కార్యక్రమం జరిగింది. జిఐఎస్ ఆధారిత వెబ్ పోర్టల్, జియో టాగింగ్, మౌలిక సదుపాయాల మ్యాపింగ్ ద్వారా సర్వేలో పారదర్శక విధానంలో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించారు. సర్వేలో వెయ్యికి పైగా ప్రాంతాలకు చెంది 5 లక్షల కుటుంబాల నుంచి అభిప్రాయాలు సేకరించి విశ్లేషించారు. 24,000 నీటి నమూనాలు పరీక్షించారు. నిర్ణయాలు తీసుకోవడం, సేవలు నాణ్యత పెంచడం, ప్రజల భాగ స్వామ్యాన్ని పెంపొందించడం ,ప్రజలకు నీటి వినియోగం, సంరక్షణ అంశాలలో అవగాహన కల్పించడానికి పే జల్ సర్వేక్షన్ ఫలితాలు స్థానిక సంస్థలకు అవకాశం కల్పిస్తాయి.

# మాదాపూర్‌లో ఘోరం.. వేగంగా వెళ్తున్న కారులో మంటలు

నగర పరిధిలోని మాదాపూర్ – కేపీహెచ్‌బీ కాలనీల మధ్య ఘోరం జరిగింది. ఈ మార్గంలో వేగంగా వెళ్తున్న కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ కారును ఆపాడు. అందులో ఉన్న ప్రయాణికులను కిందకు దించేశాడు. ఇంజిన్‌లో నుంచి మంటలు చెలరేగినట్లు డ్రైవర్ తెలిపాడు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఇంజిన్‌లో మంటలు చెలరేగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో మంటలు చెలరేగడంతో మాదాపూర్ ? కేపీహెచ్‌బీ మధ్య భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు కారును రోడ్డు పక్కకు నెట్టేసి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# కలిసికట్టుగా ఉద్యమిస్తే విజయం మనదే : బోయినపల్లి వినోద్ కుమార్




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 27:(నేటినిజం ప్రతినిధి): శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత ఓటమిపై 20 రోజులపాటు అధ్యయనం చేసాం. బీఆర్ఎస్‌పార్టీకి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ పార్టీకి కార్యకర్తలే. ప్రజల పట్ల ప్రేమాభిమానంతో నడుచుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం వేములవాడ నియోజకవర్గస్థాయి కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశంలో పాల్గొని మాట్లాడారు.మన టార్గెట్ కరెక్టుగా ఉంటే విజయం సాధిస్తామని స్పష్టం చేశారు. గులాబీ పార్టీ పుట్టినరోజు ఉంటదా పోతదా అనే పరిస్థితిలో ఉండేది. కానీ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి తెలంగాణ సాధించామన్నారు. అంతేకాదు 24 గంటల కరెంట్ సరఫరా,120 అంతస్తుల పైన గడ్డమీద ఉన్న తెలంగాణకు గోదావరి నీటిని తరలించామని పేర్కొన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు ఇచ్చామని గుర్తు చేశారు. మీరందరూ కలిసి పనిచేస్తే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేయడం ఖాయమన్నారు.

దేశంలో గట్టి పోటీ లేని ప్రతిపక్షం ఉన్నందునే మోదీ గెలుస్తామని చెబుతున్నారు. అతి విశ్వాసంలో కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షంగా బలమైన పార్టీగా గులాబీ పార్టీ ఉందని చెప్పారు. మనకున్న శక్తి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు లేవన్నారు.

మార్చి కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నిజాలను ప్రజలకు వివరిద్దామన్నారు. నేనొక కార్యకర్తగా, నాయకుడిగా మీకు అందుబాటులో ఉంటాను. ఫోన్ చేసిన మాట్లాడతానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత వచ్చే ప్రతి స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం గెలుపొందాలే పని చేయాలని పిలుపునిచ్చారు.

# మణుగూరు భారజల కర్మాగారానికి అవార్డు..




ఖమ్మం, ఫిబ్రవరి 27(నేటినిజం ప్రతినిధి): అశ్వాపురం మండలంలో గల మణుగూరు భారజల కర్మాగారానికి 2022-2023 ఏడాదికి గాను స్పెషల్ అచీవ్ మెంట్ అవార్డు లభించింది. హెవీ వాటర్ డే సందర్భంగా ముంబైలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో భారత అనుశక్తి విభాగం కార్యదర్శి అనుశక్తి కమిషన్ చైర్మన్ అయిన అజిత్ కుమార్ మొహంతి చేతుల మీదుగా స్పెషల్ అవార్డును మణుగూరు భారజల కర్మాగార జీఎం జగ్గారావు, మణుగూ రు ఏవి వాటర్ ప్లాంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, అనుశక్తి కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షులు గడ్డం రమేష్ అందుకునారు.ఈ సందర్భంగా జిఎం జగ్గారావు మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం మూలంగానే మణుగూరు కర్మాగారానికి ఈ అవార్డు దక్కిందన్నారు. ఈ అవార్డును దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సమన్వయంతో పనిచేస్తూ మణుగూరు భారతీయుల కర్మాగారాన్ని అగ్రస్థానం లో నిలిచే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.




# హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో భారీ బదిలీలు..

హైదరాబాద్, ఫిబ్రవరి 27:సిటీలో 71 మంది ఎస్ఐలను, ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చాదర్‌ఘాట్ ఎస్‌హెచ్ఓ వై.ప్రకా?షరెడ్డిని మల్టీజోన్2కు, మారేడుపల్లి ఎస్‌హెచ్ఓ డి.శ్రీనివాసరావును ఎస్‌బీకి అటాచ్ చేశారు.

# ఎన్నికలపై వైసీపీ నేతలకు జగన్ దిశానిర్దేశం..

అమరావతి, ఫిబ్రవరి 27:ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి క్యాడర్ కు సీఎం జగన్ కీలక సూచనలు చేశారు. మంగళగిరిలోని సీకె కన్వెన్షన్ హాల్‌లో పార్టీ క్యాడర్‌కు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సీఎం జగన్ వైసీపీ నేతలకు ఎన్నికల ప్రచారంపై రూట్ మ్యాప్ ఇచ్చారు. రానున్న 45 రోజులు అత్యంత కీలకం అని సీఎం జగన్ అన్నారు.

తమ తమ బూత్ కమిటీల పరిధిలో ఉన్న ఓటర్లను ఎన్నికల లోపు ఐదుసార్లు కలవాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వ పథకాలను, పనులను ప్రజలకు వివరించాలని.. బూత్ స్థాయిలో పార్టీని వీలైనంత తొందరగా యాక్టివేట్ చెయ్యాలని తెలిపారు. సోషల్ మీడియాలో పార్టీ క్యాడర్ క్రియాశీలకంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు నేను పని చేశాను, ఇక నుంచి పూర్తిగా మీరే పని చేయాలని సీఎం జగన్ ఆదేశించారు.

అదేవిదంగా.. వైసీపీ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తైంది.. ఒకటి రెండు చోట్ల చిన్న చిన్న మార్పులు తప్ప.. మిగిలిన అభ్యర్థులు అంతా సిద్దంగా ఉననట్లు జగన్ చెప్పారు. అటు పార్లమెంట్, ఇటు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రస్తుతం ఎవరైతే ఇంఛార్జిలుగా ఉన్నారో వారే అభ్యర్థులుగా ఉంటారని జగన్ చెప్పారు.

# ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు..

## - సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 27: ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు. ప్రజా సంక్షేమంలో లాభ నష్టాలు చూసుకోరు. ప్రజల ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కోసం పెట్టే ఖర్చులో కూడా లాభం తీయాలనుకునేవారు వ్యాపారులు అవుతారు తప్ప పాలకులు కారని మాజీ మంత్రి హరీశ్ రావు సీఎం రేవంత్‌రెడ్డిపై ఫైర్ అయ్యా రు. సీఎం మిషన్ భగీరథపై మాట్లాడిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథలో లాభం వెతికేవాడు ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టకరమన్నారు.

ప్రజలకు నిరంతరం సురక్షితమైన మంచినీరు అందించాలనే గొప్ప ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని తెచ్చింది. దేశంలో ఎవరికీ సాధ్యం కాని విధంగా వంద శాతం ఇండ్లకు నల్లాల ద్వారా సురక్షితమైన మంచినీటిని సరఫరా చేయడం సాధ్యమయింది. ఇది ప్రభుత్వానికి లాభం తెచ్చే పని కాదు కాబట్టి, ఈ మిషన్ భగీరథ దండుగ అని రేవంత్ రెడ్డి మాట్లాడడం అత్యంత శోచనీయమన్నారు.

మిషన్ భగీరథ కోసం మా ప్రభుత్వం రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తే, దాన్ని రూ.50 వేల కోట్లకు పెంచి చెబుతున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు.

ఆ పథకం ఎందుకు తేవాల్సి వచ్చింది ?

మిషన్ భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని, దానికి తెచ్చిన అప్పుకు వడ్డీ ఎలా కడుతారని రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యమైన, భావ దారిద్ర్యమైన ఆరోపణ ఇంకోటి ఉండదని మండిపడ్డారు. అసలు మిషన్ భగీరథ పథకం ఎందుకు తేవాల్సి వచ్చింది? దాని లక్ష్యం ఏమిటి? అనే విషయాలపై కనీస అవగాహన కూడా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి లేకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాకముందు తెలంగాణ రాష్ట్రంలో మంచినీటి సౌకర్యం కలిగిన జనావాసాల సంఖ్య కేవలం 5,672 అయితే, 2023 పూర్తయ్యే నాటికి 23,930 ఆవాస ప్రాంతాలకు మంచినీళ్లు అందుతున్నాయి.

2014కు ముందు కేవలం 30 శాతం ఇండ్లకు మాత్రమే నల్లాల ద్వారా మంచినీటి సౌకర్యం ఉండేది. అది వ్పుడు వంద శాతానికి చేరుకుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వందకు వందశాతం నల్లాల ద్వారా మంచినీరు ఇచ్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిందని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే పార్లమెంట్ సాక్షిగా వెల్లడించిందని గుర్తు చేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలి తప్పా అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవు పలికారు.

ప్రజలు కలలో కూడా ఊహించి ఉండరు

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 48 లక్షల ఎకరాలకు నీళు అందించిందని లెక్కలు, ఆధారాలతో సహా చెప్పినా వీరికి అవగాహన కలుగడం లేదన్నారు.

రైతులకు సాగునీరు ఇవ్వడాన్ని, ప్రజలకు మంచినీరు ఇవ్వడాన్ని కూడా లాభనష్టాలతో బేరీజు వేసుకునే ప్రభుత్వం ఒకటి వస్తుందని తెలంగాణ ప్రజలు కలలో కూడా ఊహించి ఉండరన్నారు. ఆసరా పెన్షన్ల ద్వార కూడా వేల కోట్లు ఖర్చు అవుతుంది. దాని వల్ల లాభం లేదంటారా.. అని ప్రశ్నించారు.

మీరు ఇచ్చిన హామీలే మీకు ఉరితాళ్లుగా మారబోతున్నాయి. ముందు ఆ హామీల గురించి మాటాడాలని హితవు పలికారు. చివరిగా ఒక మాట.. రేవంత్ రెడ్డి ప్రతి సారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు.

నేను కూడా మీ ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరెత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజలకోసం ఎవరెంత ఆలోచిస్తున్నారో, ఎవరెంత పనిచేస్తున్నారో మాత్రమే వారికి అవసరమన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ లు పి.ఆర్.సి 40% ఇవ్వాలి

## -పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి




హైదరాబాద్ ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్); తెలంగాణ ఉద్యోగుల సంఘం అత్యవసర సమావేశంలో ఐపీఎంలో జరిగింది. పెండింగ్ లో ఉన్న డి.ఏ లను వెంటనే విడుదల చేయాలి మరియు పి.ఆర్.సి 40% ఇవ్వాలి. అప్పుడు కెసిఆర్ ప్రభుత్వంలో పి.ఆర్.సి 42% ఇచ్చారు, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పి.ఆర్.సి 40% ఇవ్వాలని సమావేశం డిమాండ్ చేసింది. అదేవిధంగా సి.పి.ఎస్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు అందరు ఎదురుచూస్తున్నారు అదేవిధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిన ప్రభుత్వం సకల జాగ్రత్తలతో శ్రీకారం చుడుతుంది ఉప సంఘం నివేదిక తర్వాత ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బదిలీలలు జరుగుతాయి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ విడిపోయి గత పది సంవత్సరాలు అవుతుంది కానీ తెలంగాణ ఉద్యోగులు ఆంధ్రలో పనిచేస్తున్నరు తెలంగాణ ఉద్యోగులును తెలంగాణకు అతి త్వరలో తీసుకురావాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యోగుల కేంద్ర సంఘం సభ్యుడు ఐపీఎం రాష్ట్ర అధ్యక్షులు జి మహేష్ కుమార్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి, ఉపాధ్యక్షులు కొండా అరవింద్ కుమార్, మొహమ్మద్ గౌస్ పాషా, జాయింట్ సెక్రెటరీ రాము చారి తదితరులు పాల్గొన్నారు.

### బీసీ జాబితా నుంచి 26 కులాల తొలగింపుపై విచారణ ఏప్రిల్ 3కు వాయిదా

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణలో బీసీ జాబితా నుంచి 26 కులాల తొలగింపుపై సుప్రీంకోర్టు మంగళవారం నాడు విచారణ చేపట్టింది. బీసీ జాబితా నుంచి 26 కులాల తొలగింపుపై సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. ఈ పిటీషన్‌ను న్యాయమూర్తులు సుధాంశు, బాలచంద్ర ప్రసన్నల ధర్మాసనం విచారణ చేపట్టింది. కులగణన చేపడుతున్నామని సుప్రీంకోర్టులో అఫిడవిట్‌ను రేవంత్ సర్కార్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కులగణన తర్వాత బీసీ జాబితాపై నిర్ణయం తీసుకుంటామని అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. కులగణన తర్వాత నివేదిక సమర్పిస్తామని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

### విజయవాడలో టౌన్ ప్లానింగ్ అధికారి ఇళ్లపై ఏసీబీ దాడులు

కోట్లకు కోట్లు అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో కృష్ణాజిల్లా తాడిగడప మున్సిపాలిటీ అసిస్టెంట్ సిటీప్లానర్ ఇళ్లపై తిరుపతి ఏసీబీ అధికారులు అనూహ్యంగా దాడులు ప్రారంభించారు. ఈ దాడులపై అందిన సమాచారం ఇలా ఉంది. విజయవాడ సమీపంలోని అయ్యప్పనగర్లో ఆయన ఇంటిలో సోదాలు నిర్వహిస్తున్నారు. తాడిగడప మున్సిపాలిటీ ఏసీపీ మురళి గౌడ్ గతంలో తిరుపతి కార్పొరేషన్లో ఇన్ చార్జి ఏసీపీగా పని చేశారు. ఆయన బదిలీపై విజయవాడ కార్పొరేషన్ వచ్చారు. అదే సమయంలో అక్రమాస్తుల కేసులో అరెస్టు చేసేందుకు ఏసీబీ అధికారులు చుట్టుముట్టగా మురళీగౌడ్ తప్పించుకున్నారు.

అనంతరం తన పలుకుబడిని వినియోగించి తాడిగడన మున్సిపాలిటీలో ఇన్చార్జిగా విధుల్లో చేరారు. రెండు నెలల కిందటే ఏసీపీగా పదోన్నతి అందుకున్నారు. కాగా.. 14400 ట్రోల్ ఫ్రీకి మురళి గౌడ్ పై ఫిర్యాదులు పెరిగాయి. అవినీతి, అక్రమార్జనతో కోట్లకు కోట్లు కూడబెట్టారని ఫిర్యాదులు పెరగటంతో తిరుపతి ఏసీబీ అధికారులు మంగళవారం అకస్మాత్తుగా ప్రత్యక్షమయ్యారు. మురళి గౌడ్ ఇంటిలో తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే అనేక కీలక పత్రాలు, నగదు, బంగారం దొరికినట్టు సమాచారం.

# 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్-2.. బయో ఏసియా సదస్సులో రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 27:త్వరలోనే హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రెండో ఫేజ్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైటెక్స్‌లో హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ బయో ఏషియా 2024 సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ ఏడాది జీనోమ్ వ్యాలీ ఎక్సెలెన్స్ 2024 అవార్డుకు ఎంపికైన నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ గ్రెగ్ ఎల్. సెమెంజాను సీఎం అభినందించారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సెమెంజాకు అవార్డును అందించారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'మూడు వందల ఎకరాల్లో రూ.2000 కోట్ల పెట్టుబడులతో జీనోమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తాం. లక్ష కోట్ల పెట్టుబడులతో 10 ఫార్మా విలేజీలను ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. దీంతో మౌలిక సదుపాయాలతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. 5 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో ఈ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఒక గంట ప్రయాణ దూరంలోని అత్యంత సమీపంలో వీటిని ఏర్పాటు చేస్తున్నందున ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికీ ఎంతో సదుపాయంగా ఉంటుంది.' అన్నారు. కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలు ఉన్న పరిస్థితుల్లో హైదరాబాద్ వేదికగా జరుగుతోన్న బయోఏషియా సదస్సు కీలకంగా మారిందని ముఖ్యమంత్రి అన్నారు. బయోసైన్స్ రాజధానిగా హైదరాబాద్ నేడు యావత్ మానవాళికి ఒక భరోసాగా నిలిచిందని అన్నారు. వైరస్ భయాలను ధీటుగా ఎదుర్కోగలమనే నమ్మకాన్ని హైదరాబాద్ కలిగించిందని, ఇప్పుడు ప్రపంచంలో వినియోగించే ప్రతి మూడు వ్యాక్సిన్లలో ఒకటి హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతోందని గుర్తు చేశారు.

ఆరోగ్య భద్రత విషయంలో ప్రపంచంలోని అందరి సమస్యలు ఒకేలా ఉన్నాయని కొవిడ్ నిరూపించిందని, అయితే సమస్యల పరిష్కాలను కూడా మనం కలిసికట్టుగానే సాధించాలని సీఎం సూచించారు. ఒక్క బయో సైన్సెస్ లోనే కాదు, ఐటీ–సాఫ్ట్ వేర్, రీసెర్చ్, స్టార్టప్ రంగాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను మరింత సమున్నతంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ, దేశీయ సంస్థలు ఇక్కడ ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన అనుకూల వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు. చిన్న స్టార్టప్‌లు, పెద్ద కార్పొరేట్ కంపెనీలకు వారధిగా నిలిచే ఎంఎస్ఎంఈ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.

"మీరు నింగిలోని తారల వద్దకు చేరాలని కలలు కంటే.. మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లే రాకెట్ లా మా ప్రభుత్వం పనిచేస్తుంది" అని సీఎం వ్యాఖ్యానించారు. ఇటీవల దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు భారీ స్థాయిలో రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. ఏటా 5 కోట్ల డోసుల వ్యాక్సిన్ల ఉత్పత్తే లక్ష్యంగా ప్రఖ్యాత టకెడా సంస్థ ఇక్కడి బయోలాజికల్–ఈ సంస్థతో కలిసి హైదరాబాద్‌లో తయారీ కేంద్రం నెలకొల్పడాన్ని స్వాగతించారు. వైరస్‌ల వల్ల ప్రపంచంలో నెలకొన్న భయాలకు హైదరాబాద్ నుంచి నమ్మకాన్ని కల్పిస్తున్నామని సీఎం అన్నారు. జర్మనీకి చెందిన మిల్టేనీ సంస్థ తన రీసెర్చ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిందని చెప్పారు. మానవాళికి మంచి చేసే చర్చలు, ముందడుగుతో హైదరాబాద్ బయో ఏషియా సదస్సు విజయవంతం కావాలని సీఎం ఆకాంక్షించారు.

# మార్చి నెలలో తిరుమలలో జరిగే విశేష ఉత్సవాలు ఇవే..!

తిరుపతి, ఫిబ్రవరి 27: తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మార్చి నెలలో జరిగే విశేష ఉత్సవాలను టీటీడీ అధికారులు వెల్లడించారు. మార్చి 3వ తేదీన పల్స్ పోలియో, 6వ తేదీ, 20వ తేదీన సర్వ ఏకాదశి, 8న మహా శివరాత్రి, మార్చి 20 నుంచి 24 వ తేదీ వరకు వార్షిక తెప్పోత్సవం, 25న తుంబూరు తీర్థ ముక్కోటి, లక్ష్మి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## మార్చి 1 నుంచి టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలు

టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీలు మార్చి 1వ నుంచి 18వ తేదీ వరకు జరుగనున్నాయని తెలిపారు. తిరుపతిలోని పరిపాలనా భవనంలో గల పరేడ్ మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పురుషులకు, మహిళలకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తున్నామని, టగ్ ఆఫ్ వార్, చెస్, వాలీబాల్, క్యారమ్స్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, షటిల్, టెన్నిస్ తదితర క్రీడలు నిర్వహించనున్నామని తెలిపారు. టీటీడీ సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో స్నేహలత క్రీడల నిర్వహణను పర్యవేక్షిస్తారని వివరించారు.

# బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 27:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దహనం చేశారు.

తదనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో బండి సంజయ్ పై ఫిర్యాదు చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. బండి సంజయ్ వెంటనే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ కనికరపు రాకేష్, నాయకులు చిలుక రమేష్, కూరగాయల కొమురయ్య, పులి రాంబాబు, పుల్కం రాజు, సగ్గు పద్మ, బొజ్జ భారతి, వస్తాద్ కృష్ణ, అక్కేనపల్లి నరేష్, లింగంపల్లి కిరణ్, కూరగాయల శ్రీశైలం, గంజి జైపాల్, ముంజ ఉమేందర్, ముప్పిడి శ్రీధర్, సాబీర్, నాగుల విష్ణు, నాగుల మహేష్, దూలం భూమేష్, మహమ్మద్ వలీ, కోలకాని రాజు, వనపర్తి శంకర్ తదితరులు ఉన్నారు.

# కరీంనగర్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసానికి సిద్ధమా!

**మంత్రి పొన్నం ప్రభాకర్ కు బండి సంజయ్ సవాల్**
**–ప్రజాహిత యాత్రను అడ్డుకోవాలని చూస్తే ఖబడ్దార్**
**–వంద రోజుల్లోనే హామీలు నెరవేర్చి, ఓట్లు అడగండి**
**–బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్**

కరీంనగర్, ఫిబ్రవరి 27: (నేటినిజం ప్రతినిధి) హుస్నాబాద్ నియోజకవర్గంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌మలిదశ ప్రజాహిత్ర 2వ రోజు బొమ్మెనపల్లిలో ప్రారంభమై మంగళవారం రాములపల్లెలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా హుస్నాబాద్ లో కాంగ్రెస్ మూకలు



బీజేపీ ఫ్లెక్సీలు చింపివేస్తూ, బండి సంజయ్ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తుండడంపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజాహిత యాత్రకు అడగడుగునా అడ్డంకులు, అరాచకాలు సృష్టించేందుకు యత్నిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు సవాల్ విసిరారు. "కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశానో ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లోకి వెళుతున్నానని బండి సంజయ్ అన్నారు. కేంద్రం ఎన్ని నిధులిచ్చిందో, మోదీ ఏం చేశారో చెబుతున్నానని తెలిపారు. రాముడు అయోధ్యలో పుట్టారనడానికి ఆధారాలేమిటని కించపర్చే వారిని ప్రశ్నిస్తూ జనంలోకి వెళుతున్నానని, కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కాంగ్రెస్ విధానాలు, నినాదాలతో ఎన్నికల్లోకి వెళ్లాలని సూచించారు. కరీంనగర్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే మంత్రి పదవికి రాజీనామా చేసి శాశ్వతంగా రాజకీయాల నుండి తప్పుకునేందుకు సిద్ధమా అని మంత్రి పొన్నం ప్రభాకర్ కు సవాల్ విసిరారు. 6 గ్యారంటీలను అమలు చేయడం చేతగాక ప్రశాంతంగా ప్రజాహిత యాత్ర చేస్తుంటే కాంగ్రెస్ మూకలను పంపి విధ్వంసం సృష్టించాలనుకుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గతంలో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పొన్నం ప్రభాకర్ ఆయనను తీవ్రంగా వ్యతిరేకించారని, ఇప్పుడు కూడా ఇలాంటి విధ్వంసాలకు పాల్పడుతూ అరాచకాలు సృష్టిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తేలా చూస్తున్నారని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డి పొన్నం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాముడిని, అయోధ్య అక్షింతలను కించపర్చినందుకు జనం కాంగ్రెస్ నేతలను ఛీత్కరించుకుంటున్నారని, అయినా మారకపోతే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తానని చెప్పి, ఇందిరాగాంధీ ఫోటో పెట్టుకుని మేనిఫెస్టో విడుదల చేశారని గుర్తుచేశారు.

అధికారంలోకి వచ్చి 80 రోజులైందని, ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 6 గ్యారంటీలను, మేనిఫెస్టోలోని 423 హామీలను అమలు చేయకుంటే ఇందిరాగాంధీని అవమానించినట్లేనని చెప్పారని గుర్తుచేశారు. రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో మునిగిపోయిందని, అయినా హామీలు ఇచ్చారని, వాటిని ఎలా అమలు చేస్తారో చూపాలన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా బియ్యం ఇస్తుంటే రేషన్ షాపుల వద్ద ముఖ్యమంత్రి ఫోటోలు పెట్టుకోవడమేంటని, ప్రధాని ఫోటో ఎందుకు పెట్టుకోవడం లేదన్నారు..

# బీహార్‌లో కాంగ్రెస్, ఆర్జేడీలకు షాక్.. బీజేపీలో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కేంద్రంలో నరేంద్రమోదీ సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా ఏర్పాటైన ఎఔఆఎం కూటమికి లోక్‌సభ ఎన్నికల ముందు దెబ్బ మీద దెబ్బ తగులుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో ఆ కూటమి పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు అధికార బీజేపీలో చేరుతున్నారు. తాజాగా బీహార్‌లో కూడా ఎఔఆఎం కూటమికి షాక్ తగిలింది. అక్కడ ఆ కూటమిలోని పార్టీలైన కాంగ్రెస్ నుంచి ఇద్దరు, ఆర్జేడీ నుంచి ఒక ఎమ్మెల్యే బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అంతకుముందే తమ పార్టీల ప్రాథమిక సభ్యత్వాలకు వారు రాజీనామాలు చేశారు.

బీజేపీలో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మురారి ప్రసాద్ గౌతమ్, సిద్ధార్థ్ సౌరవ్.. ఆర్జేడీకి చెందిన సంగీత కుమారి ఉన్నారు.

మురారీ ప్రసాద్ గౌతమ్ చెనారి స్థానం నుంచి బీహార్ అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఆయన గతంలో రాష్ట్ర మంత్రిగా కూడా పనిచేశారు.

సిద్ధార్థ్ సౌరవ్ విక్రమ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు.

ఇక ఆర్జేడీకి చెందని సంగీతా దేవి కుమారి మొహానియా అసెంబ్లీ స్థానం నుంచి సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా, ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెన్ పార్టీలో చేరడంలో బీహార్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత సామ్రాట్ చౌధరి కీలకపాత్ర పోషించినట్లు సమాచారం.

# కాంగ్రెస్ నేత ఫిరోజ్ పాషా పాదయాత్రకు సంఘీభావం




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 27:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలిస్తే కామారెడ్డి జిల్లాలోని బడా పహాడ్ కు పాదయాత్రగా వస్తానని కాంగ్రెస్ పార్టీ కోనరావుపేట మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా ఎన్నికలకు ముందు మొక్కుకున్నాడు. ఈ క్రమంలో ఆది శ్రీనివాస్ గెలవడం పట్ల ఫిరోజ్ పాషా బావుసాయిపేట నుండి బడా పహాడ్ కు పాదయాత్ర ప్రారంభించాడు.

మంగళవారం కామారెడ్డి జిల్లాలోని రెడ్డిపల్లికి ఫిరోజ్ పాషా చేరుకోగా, కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామి యాదవ్ సంఘీభావం తెలిపి, పాషాను శాలువాతో సన్మానించాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆది కార్తీక్, మాజీ సర్పంచ్ కదిరే రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు మానుపటి పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

# మహా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి అజిత్‌పవార్

ముంబాయి, ఫిబ్రవరి 27:మహారాష్ట్ర అసెంబ్లీలో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి అజిత్ పవార్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరం తొలి 5 నెలలకు సంబంధించి తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మరోసారి బడ్జెట్ సమావేశాలు నిర్వహించి మిగతా బడ్జెట్‌ను ప్రవేశపెడుతామని తెలిపారు.

వచ్చే ఏడాది మార్చికల్లా నవీ ముంబై ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తుందని తన బడ్జెట్ ప్రసంగంలో అజిత్ పవార్ పేర్కొన్నారు. రాష్ట్రం కోసం నూతన ఓఓఇ పాలసీని రూపొందిస్తున్నామని చెప్పారు. జల్ జీవన్ మిషన్ కింద 1.47 కోట్ల ఇండ్లకు మంచినీటి కనెక్షన్‌లు ఇవ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. అందరికీ ఇండ్లు పథకం కింద దివ్యాంగులకు 34,400 ఇండ్లు సమకూర్చనున్నామని వెల్లడించారు.

అదేవిధంగా ఆయోధ్య, శ్రీనగర్ నగరాల్లో మహారాష్ట్ర భవన్‌లు నిర్మించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని అజిత్‌పవార్ చెప్పారు. ఆ రెండు నగరాల్లో భూసేకరణ కోసం రూ.77 కోట్లను కేటాయిస్తున్నామని తెలిపారు. అంతేగాక స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్‌ను నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అదేవిధంగా అహల్యాబాయ్ హోల్కర్, జ్యోతిబాఫూలే, లహూజీ సాల్వే తదితర మహనీయుల స్మారకాలను నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదన చేస్తోందని పవార్ చెప్పారు.

# ఆరు గ్యారంటీలు అమలు అటకెక్కినట్లే : బీజేపీ



నిజామాబాద్, ఫిబ్రవరి 27: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం విజయ సంకల్ప యాత్ర సాగింది. భీంగల్ లోని బడా భీంగల్ చౌరస్తాలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రకు డి.కే. అరుణ, ఎంపీ ధర్మపురి అరవింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలు అమలు కావాలంటే కేంద్రంలో రాహుల్ ప్రధాని కావాలని రాష్ట్ర ముఖ్య మంత్రి చెప్పే మాటలు చూస్తుంటే ఆరు గ్యారంటీలు అమలు అటకెక్కినట్లేనని భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కు ఓటు వేసి మోస పోవద్దన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు. ఔరేక్ బార్ మోడీ సర్కార్ పక్కా అని ధీమా వ్యక్తం చేశారు.

## ఔర్ ఏక్ బార్ మోడీ సర్కార్.. ఎంపీ ధర్మపురి అరవింద్

రాష్ట్రంలో 10 నుంచి 12 సీట్లు గెలుస్తామని, ఔరే ఏక్ బార్ మోడీ సర్కార్ పక్కా అని ఎంపీ ధర్మపురి అరవింద్ ధీమా వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీకి శ్రీరాముని ఆశీర్వాదం ఉందని, 500 ఏళ్ల కల నెరవేర్చిన మోడీ మూడోసారి ప్రధానమంత్రి అవుతారని అన్నారు. మైనార్టీల కోసం కూడా బిజెపి ప్రభుత్వం ఎంతో చేస్తుందని అన్నారు.

# స్మార్ట్ ట్రావెల్ సొల్యూషన్స్‌తో అరిస్టా వాల్ట్ స్లైక్స్ షార్క్ ట్యాంక్ డీల్




హైదరాబాద్, ఫిబ్రవరి 27: అరిస్టా వాల్ట్, భారతదేశపు మొట్టమొదటి స్మార్ట్ లగేజ్ బ్రాండ్ మరియు ప్రయాణ సౌలభ్యం మరియు భద్రత యొక్క దృశ్యాన్ని పునర్నిర్వచించటానికి అంకితమైన ఒక వినూత్న స్టార్టప్, షార్క్ ట్యాంక్ ఇండియా సీజన్ 3లో వారి స్మార్ట్ ఉత్పత్తులతో కనిపించింది. ఈ చిరస్మరణీయమైన విజయం అరిస్టా వాల్ట్ యొక్క ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకత పట్ల అచంచలమైన నిబద్ధతను నొక్కి చెబుతుంది, ఇది దూరదృష్టి గల నాయకత్వాన్ని ప్రదర్శిస్తుంది: శ్రీమతి పూర్వి రాయ్, సిఇఓ, శ్రీ అతుల్ గుప్తా, సి ఎఫ్ ఓ, షార్క్ ట్యాంక్ ఇండియా సీజన్ 3 ఎపిసోడ్‌లో కనిపించారు, అక్కడ వారు స్మార్ట్ లగేజ్ యాంటీలాస్ట్, యాంటీ తెఫ్ట్ స్మార్ట్ వాలెట్‌లు, స్మార్ట్ ఫింగర్‌లాక్ బ్యాగ్‌లు ఒ సూపర్ ఇంటరెస్టింగ్ స్మార్ట్ ఫాలో మి ఒ రైడ్ లగేజీ గురించి మాట్లాడుతున్నారు; మిమ్మల్ని అనుసరించే సామాను, ఒ మీరు దానిపై కూడా ప్రయాణించవచ్చు; సామాను ఎయిర్‌పోర్ట్ ప్రాంప్ట్‌ను కలిగి ఉంది మరియు యాంటీ లాస్ట్‌ను కూడా కలిగి ఉంది, స్మార్ట్ లగేజీతో లగేజీ పరిశ్రమలో శాశ్వత ప్రభావాన్ని చూపేందుకు అవి సిద్ధంగా ఉన్నాయి.

ఆహ్వానము
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
GVR CULTURAL FOUNDATION
CULTURE IS LOVE OF HUMANITY
అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
నవరత్న మహిళా పురస్కారాల ప్రదానోత్సవం
ముఖ్య అతిథి :
శ్రీ పి. విజయబాబు
అధ్యక్షులు,
ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం,
ఆంధ్ర ప్రదేశ్ భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ.
సభాధ్యక్షులు: లయన్ డా॥ చిల్లా రాజశేఖర్ రెడ్డి, పారిశ్రామికవేత్త
సభాప్రారంభం: శ్రీ జమలాపురం రాధాకృష్ణ, లఘుచిత్ర నిర్మాత
సంగీత కళాకారుల సత్కారం: డా॥ టి. విజయభాస్కరరెడ్డి, న్యాయవాది, ప్రొఫెసర్ (న్యాయశాస్త్రం)
పురస్కార స్వీకర్తల స్వాగత సత్కారం: శ్రీమతి రామరాజు లక్ష్మీశ్రీనివాస్, డా॥ సి. నారాయణరెడ్డి స్వర్ణకంకణ స్వీకర్త, ప్రముఖ వీణా విద్వాంసురాలు, గుంటూరు
అతిథుల సత్కారం: డా॥ లయన్ ఎస్. రామచంద్ర రావు, చైర్మన్, ఎస్. ఆర్. ఆర్. చారిటబుల్ ఫౌండేషన్
గౌరవ అతిథి: డా॥ ఎల్. జయంతిరెడ్డి, చైర్మన్, జె.జె. హాస్పిటల్
జ్యోతి ప్రకాశనం: శ్రీమతి కె. విజయలక్ష్మి, పారిశ్రామికవేత్త
ఆత్మీయ అతిథి: డా॥ కె. వీరభోగ వసంతరాయులు, కళాపోషకులు
తేది : 11-03-2024, సోమవారం, సా॥ 5.30 గం॥లకు
శ్రీత్యాగరాయ గానసభ (ప్రధానమందిరం), చిక్కడపల్లి, హైదరాబాద్.
గుదిబండి వెంకటరెడ్డి, చైర్మన్ - 9849882783
లయన్ వి.వి.రాఘవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి - 9866332738

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.